RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 16 జూన్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:15

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైంది

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి





రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి.

99 రోజుల యాక్షన్ ప్లాన్లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేకపోయాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మిగతా 2లో

## రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అల్పాహారం -- పాలు పథకం ప్రారంభం



వార్తా 4 లో

## తెలంగాణకు అలర్ట్... జూన్ 19 నుంచి భారీ వర్షాలు

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగాలను అప్రమత్తం చేసింది. జూన్ 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇవి వారం రోజుల పాటు కొనసాగవచ్చన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నైరుతి రుతుపవనాలు జూన్ 8న జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించి, జూన్ 14 నాటికి దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాలకు విస్తరించాయి. ఇవి రానున్న మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా, జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 49.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సాధారణ వర్షపాతం 54.9 మి.మీ. కంటే ఇది 10 శాతం తక్కువగా నమోదైంది.

వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.



ప్రజాబలం

16 జూన్ 2026 మంగళవారం

# టార్గెట్ టూ థర్డ్....

2024 ఎన్నికల తరువాత మోదీ ప్రభుత్వం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి వచ్చింది. కానీ, గత రెండేళ్లుగా తన బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ చాలా చాలా ప్రయత్నాలు చేస్తున్నది. దీర్ఘకాలంగా తమతో ప్రయాణం చేస్తున్న కొన్ని పార్టీలు, పరిస్థితులను బట్టి మారే మరికొన్ని మిత్ర పక్షాలు, రాజకీయ అవసరాలు, అంశాలవారీగా మద్దతిచ్చే పక్షాలకు దగ్గరయ్యేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 240 సీట్లు ఉన్నాయి.ఎన్డీయే మిత్రపక్షాలను కలిపినా 293 సీట్లతో సాధారణ మెజారిటీ మాత్రమే ఉన్నది. మూడింట రెండొంతుల మెజారిటీ కావాలంటే 362 సీట్లు అవసరం. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోతే ఏమవుతుందో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీకి అనుభవంలోకి వచ్చింది. దీంతో వివిధ పార్టీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే 20 మంది టీఎంసీ ఎంపీలు లక్ష్యంగా ఆపరేషన్ లోటస్‌కు తెరదీసినట్టు తెలుస్తున్నది.వీరితో పాటు శిరోమణి అకాలీదళ్ కూడా బీజేపీతో జతకట్టే అవకాశం ఉంది. ఎందుకంటే, త్వరలో జరుగనున్న పంజాబ్ ఎన్నికల్లో అకాలీదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే, ఈ రెండు పార్టీల సభ్యులను కలుపుకొని ఎన్డీయే బలం 318కి చేరుతుంది. ఇక తమిళనాడులో డీఎంకేను తోసిరాజని టీవీకేతో కాంగ్రెస్ జతకట్టింది. డీఎంకే గతంలోనూ ఎన్డీయేతో కలిసి పనిచేసింది.ఇటీవల ఇండీ కూటమి సమావేశానికి కూడా డీఎంకే దుమ్మా కొట్టింది. ఈ క్రమంలో డీఎంకేను బీజేపీ సంప్రదించవచ్చు. ఇక వైఎస్సార్సీపీ. టీడీపీతో ఆ పార్టీకి రాజకీయ శత్రుత్వం ఎట్లా ఉన్నప్పటికీ, మొదటినుంచీ బీజేపీతో సత్సం బంధాలు కొనసాగుతూనే ఉన్నా యి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఇటీ వలి కాలంలో బీజేపీకి అనుకూ లంగానే మాట్లాడుతున్నది. ఎన్నిక ల్లో ఓటమి తరువాతి పరిణామాల క్రమంలో బీజేడీ నేత నవీన్ పట్నాయక్ మళ్లీ బీజేపీ వైపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా కీలకమైన బిల్లుల విషయంలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా అదే వైఖరి కొనసాగించవచ్చు.ఇక శరద్ పవార్‌కు బీజేపీతో మంచి సంబంధాలే ఉన్నాయి. ప్రస్తుతానికి ఇండీ కూటమితో కలిసి ఉన్నప్పటికీ, కూతురు సుప్రియ రాజకీయ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. పవార్‌ను బీజేపీ సంప్రదిస్తే, ఆ పార్టీకి ఉన్న 8 మంది బలం ఎన్డీయేకు చేకూరుతుంది. కాకపోతే, టీఎంసీతో పాటు, ఎన్సీపీని విలీనం చేయాలని సోనియాగాంధీ ఇప్పటికే ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఇందుకు ఆ పార్టీలు ఏ మేరకు అంగీకరిస్తాయనేది చూడాలి. శరద్ పవార్‌తో పాటు డీఎంకేను తనకు అనుకూలంగా మార్చుకోగలిగితే.. బయటి నుంచి కూడా ముఖ్య బిల్లుల విషయంలోనైనా మద్దతు ఇచ్చే పార్టీల బలాన్ని కలుపుకొంటే మోదీ ప్రభుత్వ బలం దాదాపు 355కి చేరుకుంటుంది. మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకా ఏడుగురు తక్కువవుతారు. ఇక రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 163. బీజేపీ సొంత బలం 113, మిత్రపక్షాలను కలుపుకొంటే ఈ సంఖ్య 144కి చేరుతుంది. పది మంది టీఎంసీ సభ్యులను కలిపితే 154కి చేరుకుంటుంది. బీజేపీకి మద్దతుగా వైఎస్సార్సీపీ 7, బీజేడీ 5, ముగ్గురు ఇండిపెండెంట్లను కలిపితే 169 అవుతుంది. దీంతో రాజ్యసభలో ఎన్డీయేకు పూర్తి మెజారిటీ వచ్చినట్టే. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.ముఖ్యమైన బిల్లులను పాస్ చేయించు కోవ డానికి ఈ సంఖ్య చాలా కీలకమవుతుంది. ఉమ్మడి పౌరస్మృతి, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ఒకే దేశం, ఒకే ఓటు వంటి బిల్లులను ఆమోదించుకోవడానికి బీజేపీకి ఇప్పుడు నంబర్ అవసరమవుతుంది. ము ఖ్యంగా లోక్‌సభలో మెజారిటీ కోసం బీజేపీ పెద్దలు చాలా జాగ్రత్తగా పావులు కదుపు తున్నారు.మరో వైపు ఈసీ కూడా భారత ఎన్నికల సంఘం కేంద్ర పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి జేబుసంస్థగా మారిందనే ఆరోపణలు, విమర్శలు అనేకం. స్వతం త్ర ప్రతిపత్తి గల ఈ రాజ్యాంగ సంస్థ పక్షపాతంతో అధికారంలో ఉన్న బీజేపీకి వంతపాడుతున్నదని ప్రజాసం ఘాలు, ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి అనుకూలంగా లక్షల ఓట్లు తొలగించి విపక్షాల ఓటమికి కారణమైందనే ఆరోపణలు ఈ మధ్యకాలంలో మిన్నంటుతున్నాయి.సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి, ఎలక్షన్ల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, కేంద్ర ప్రభుత్వం కొత్త గా తీసుకువచ్చిన చట్టం ఏకపక్షంగా ఉండటంతోనే ఎన్నికల కమిషన్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనే విమర్శ కూడా ఉంది. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీచేసిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది.అయితే, ఈ క్రమంలో ఈసీ వ్యవహరించిన తీరు పై అనుమానాలు రాకమానదు. ఎన్నికలు నిస్సందేహం గా, నిష్పక్షపాతంగా జరగాలి. ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన అంతిమ బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉం టుంది. కానీ, కంచె చేను మేసిందన్నట్లుగా ఎన్నికల సం ఘం నిర్ణయం ఉన్నది. నిజంగానే అభ్యంతరాలు ఉంటే వివరణ కోరాల్సింది. అయితే, ఎన్నికల కమిషన్ అలా చేయలేదు. తెలంగాణలో ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా, మీనాక్షికి సంబంధం లేని కేసులో వచ్చిన నోటీసులను సాకు చూపి నామినేషన్ తిరస్కరించడం సబబు కాదు. ఈ తతంగం వెనుక బీజేపీ ఉందనే ప్రచారం జరుగుతున్నది.మొన్నటికి మొన్న తమిళనాడులో గవర్నర్ అవలంబించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించింది. అక్కడ ప్రజలు ఎన్నుకున్న అతిపెద్ద పార్టీని ప్రమాణస్వీకారానికి పిలువకుండా, రెండు రెండు ఆరు అన్నట్లుగా గవర్నర్ వ్యవహారశైలి ఉన్నది. బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించి తన సీటు గౌరవాన్ని తగ్గించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని తెలిసి కూడా కక్రపెత్తనానికి ఒడిగట్టారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని 'ది కింగ్ కెన్ డూ నో రాంగ్' అనే సూత్రం తెలిసినట్టుగా లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చూసినా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రిగా మొదటి అవకాశం ఇవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) ప్రకారం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అతి పెద్ద పార్టీ నాయకుడిని ఆహ్వానించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉంటుంది.అయితే, ఎమ్మెల్యేల సంతకాలు ముందే కావాలని గవర్నర్ పట్టుబట్టారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైంది

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి







మొదటి పేజీ తరువాయి

వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు.

వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు.

ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు.

రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు.

తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు.

# ఓటు హక్కు రక్షణే ధ్యేయంగా పనిచేయాలి:

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

'సర్' ప్రక్రియపై బి.ఎల్.ఎలకు సంపూర్ణ అవగాహన కల్పించాలి
నిర్లక్ష్యం వహిస్తే భారీగా ఓట్లు కోల్పోయే ప్రమాదం



రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పరిశీలన (dŸsY - SIR) ప్రక్రియను పార్టీ యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బూత్ లెవెల్ ఏజెంట్లు (BLA) క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఓట్లను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు.

ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న లోపాలు, తప్పులతో కూడిన 'అనామలస్' (ూఅశీఝశ్రీశీబం) జాబితాలోని ఓటర్ల విషయంలో బి.ఎల్.ఎలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటూ జాబితా నుంచి తొలగించబడకుండా చూడాల్సిన బాధ్యత మనదేనన్నారు. ఇందుకోసం సదరు ఓటర్లకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను (సపోర్టింగ్ డాక్యుమెంట్స్) సేకరించి, వాటిని సకాలంలో అధికారులకు సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారుల (BLO) షెడ్యూల్‌కు అనుగుణంగా బి.ఎల్.ఎలు కచ్చితమైన సమయపాలన పాటించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. "బి.ఎల్.ఓలతో నిత్యం సమన్వయం చేసుకుంటూ, పోలింగ్ బూత్‌ల పరిధిలో వారితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఈ పరిశీలన ప్రక్రియలో ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను క్షుణ్ణంగా గమనించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఎలకు తోడుగా, ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉన్న నిష్ణాతులైన ( కార్యకర్తలను గుర్తించి వారికి సహాయకులుగా జత చేయాలని పార్టీ కమిటీలకు సూచించారు.

ఓటు.. రాజ్యాంగం ఇచ్చిన హక్కు!

ఓటు అనేది కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదని, అది దేశ పౌరసత్వంతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన ఈ పరమ పవిత్రమైన హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 'సర్' ప్రక్రియ ముగిసేంతవరకు పార్టీ శ్రేణులు, నాయకులు నిరంతరం అప్రమత్తంగా ఉండి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రంగా ఉండేలా చూడాలని ఆయన ఉద్ఘాటించారు







**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ నియోజకవర్గంలోని గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ సుత్తాన్ బజార్ లో నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ యాదవ్ ,ఆర్ ఎ వినోద్‌కూమార్, ట్వింకిల్ స్టార్ పౌండేషన్ ఎండీ ఎం.గోపీయాదవ్ తదితరులు

# అంగన్‌వాడీ కేంద్రాలే చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాదులు- మంత్రి సీతక్క

## అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన మంత్రి సీతక్క





**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జిల్లా గోల్కొండ ప్రాజెక్టు పరిధిలోని మల్లేపల్లి సెంటర్, మహాత్మా గాంధీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన "అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట" కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ తో కలిసి చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ప్రీ-స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసి, ప్రాథమిక పాఠశాలల్లో చేరనున్న చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాలను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, వారిని ఆప్యాయంగా పలకరిస్తూ అభ్యాసన పుస్తకాలు, ఆటవస్తువులను అందించారు. కేంద్రంలో అందుతున్న ప్రీ-స్కూల్ విద్య, పోషకాహార సేవలు, బోధన సామగ్రి వినియోగాన్ని పరిశీలించి చిన్నారుల అభ్యాస పురోగతిపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, బాల్యంలోనే విద్యకు బలమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి అంగన్‌వాడీలో చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ సేవలను ప్రతి కుటుంబానికి చేరవేయడమే "అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రాలుగా అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల ద్వారా లభించే సేవలపై తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని తమ పిల్లలను కేంద్రాల్లో నమోదు చేయించాలని సూచించారు.

రాష్ట్రంలో అంగన్‌వాడీలను కేవలం పోషకాహార కేంద్రాలుగానే కాకుండా చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దే తొలి విద్యాలయాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో అంగన్‌వాడీల్లో యూనిఫాంలు ఇచ్చే పరిస్థితి లేదని, కానీ తమ ప్రభుత్వం ప్రతి చిన్నారికి రెండు జతల యూనిఫాంలను అందించడంతో పాటు "అమ్మ మాట -- అంగన్‌వాడి బాట" కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచుతోందన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ట్ పథకానికి మంచి స్పందన రావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. చిన్నారులకు పోషకాహారం అందించేందుకు 57 రకాల విద్యా, ఆట వస్తువులు, ఎర్లీ చైల్డ్ కేర్ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. నర్సరీ విద్య పూర్తి చేసిన చిన్నారులకు ప్రత్యేక సర్టిఫికెట్లు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో 9 లక్షల మంది చిన్నారులు నమోదు అయ్యారని, వారి ఆరోగ్యం, విద్య, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ఖిచిడీ, ఎగ్ బిర్యానీ వంటి పోషకాహారాన్ని అందిస్తున్నామని, అంగన్‌వాడీ టీచర్లకు ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. కేంద్రాల్లో ఆకర్షణీయమైన పెయింటింగ్స్ వేయించడం ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందిస్తున్నామని, వారి మెదడు వికాసం, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచే విధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

"అంగన్‌వాడీల ద్వారా పిల్లల నాలెడ్జ్‌ను పెంచి, నాణ్యమైన విద్యకు బలమైన పునాది వేస్తున్నాం. రాష్ట్రంలో 38 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సిబ్బంది కోరిక మేరకు నెలన్నర సెలవులు కూడా మంజూరు చేశాం. పోషకాహారంతో పాటు విద్యను అందించే సమగ్ర వ్యవస్థగా అంగన్‌వాడీలను తీర్చిదిద్దుతున్నాం" అని సీతక్క పేర్కొన్నారు.

తల్లిదండ్రులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, "లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సిన అవసరం లేదు. మీ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి. అత్యుత్తమ వాతావరణంలో వారిని తీర్చిదిద్దుతాం. మా అంగన్‌వాడీ టీచర్లకు మంచి నైపుణ్యం ఉంది. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయగల సామర్థ్యం అంగన్‌వాడీ వ్యవస్థకు ఉంది" అని అన్నారు.

కార్యక్రమం అనంతరం మంత్రి సీతక్క అవగాహన ర్యాలీని ప్రారంభించి కమ్యూనిటీకి సందేశం ఇచ్చారు. "అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట", "ప్రైవేట్ నర్సరీ వద్దు.. అంగన్‌వాడీ ముద్దు" అంటూ నినాదాలు చేయిస్తూ అంగన్‌వాడీ విద్యా వ్యవస్థ ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించారు. చిన్నారుల సమగ్రాభివృద్ధి, నాణ్యమైన బాల్య విద్య, మెరుగైన పోషణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి చిన్నారి ఉత్తమ అవకాశాలు పొందేలా చర్యలు కొనసాగిస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జాయింట్ డైరెక్టర్ మోతి, శాఖ అధికారులు, గోల్కొండ ప్రాజెక్టు సీడీపీఓ రేణుక, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంవిజయవంతంగా నిర్వహించినందుకు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజలను మంత్రి సీతక్క అభినందించారు.

# బద్వేలుమెడికల్‌షాపుల్లో దోపిడీ. బెంబేలెత్తుతున్న రోగులు!

బద్వేలు నిరుపేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్య అవసరాలను ఆసరాగా చేసుకుని బద్వేలు పట్టణం లోని పలు మెడికల్ షాపుల నిర్వాహకులు నిలువు దోపిడీకి తెరలేపారు. జీవన గమనంలో అత్యవసరమైన మందుల అమ్మకాల్లో ఇష్టారాజ్యంగా ధరలు వసూలు చేస్తూ ప్రజల రక్తాన్ని పిండుకుంటున్నారు. రోగమొస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా,ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లినా.చివరకు మందుల కొనుగోలు కోసం మెడికల్ షాపులకు రావాల్సిందే. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు వ్యాపారులు మానవత్వాన్ని మరచి కాసుల కక్కుర్తితో విపరీతమైన రేట్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎంఆర్పీ పేరుతో మాయాజాలంసాధారణంగా నాన్-షెడ్యూల్డ్ డ్రగ్స్, కొన్ని రకాల బ్రాండెడ్ కంపెనీల మందులపై ముద్రించే గరిష్ట విక్రయ ధర మార్కెట్ రేటు కంటే చాలా రెట్లు అధికంగా ఉంటుంది.ఈ లొసుగును బద్వేలు లోని కొందరు మెడికల్ షాపుల యజమానులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాస్తవానికి కొనుగోలు ధరపై నిర్ణీత లాభం (మార్జిన్) మాత్రమే వేసుకుని అమ్మాల్సి ఉండగా,స్ట్రిప్పులపై ఉన్న భారీ ఎంఆర్పీ ధరలకే విక్రయిస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.మరికొన్ని చోట్ల నిరక్షరాస్యులైన గ్రామీణ రోగులను టార్గెట్ చేస్తూ.మందుల అసలు ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.బిల్లులు అడిగితే ముఖం చాటేస్తున్నారు!మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన ప్రతి ఔషధానికి పక్కా కంప్యూటర్ లేదా నగదు బిల్లు ఇవ్వాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, బద్వేలు లోని మెజారిటీ షాపుల్లో రోగులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా చదువుకున్న వారు బిల్లు అడిగితే.జీఎస్టీ అదనంగా పడుతుంది,కంప్యూటర్ పని చేయడం లేదు"అంటూ సాకులు చెబుతూ ముఖం చాటేస్తున్నారు. బిల్లులు ఇవ్వకపోవడం వల్ల తాము ఎంత దోచుకుంటున్నామో బయటకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు.నాణ్యత లేని 'జెనరిక్' మందులు.బ్రాండెడ్ ధరలు!అతి తక్కువ ధరకు లభించే కొన్ని కంపెనీల జెనరిక్ మందులను తెచ్చి,వాటిని కార్పొరేట్ కంపెనీల బ్రాండెడ్ మందుల ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారు. రోగులకు ఏ మందులు ఇస్తున్నారో, అవి ఎంతవరకు పనిచేస్తున్నాయో తెలియని అయోమయ స్థితి నెలకొంది. డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్‌లో ఉన్న మందులు కాకుండా,వాటికి ప్రత్యామ్నాయంగా తమకు ఎక్కువ లాభాలు వచ్చే మందులను రోగుల చేతుల్లో పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.గ్రామీణ ప్రజలే ప్రధాన లక్ష్యం బద్వేలు చుట్టుపక్కల ఉన్న పదుల సంఖ్యలోని గ్రామాల నుంచి పేద ప్రజలు, కూలీలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. మందుల ధరలపై అవగాహన లేకపోవడం వల్ల వ్యాపారులు ఎంత చెబితే అంత డబ్బులు చెల్లించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి మరీ రోగాల నివారణకు మందులు కొంటున్నామని, కానీ ఇక్కడి రేట్లు చూస్తే గుండె ఆగుతోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిఘా కరవు!మండలంలో ఇంత బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (ఔషధ నియంత్రణ శాఖ అధికారులు) గానీ,స్థానిక అధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపుల్లో కనీసం ధరల పట్టికను కూడా ప్రదర్శించడం లేదు. నిబంధనల ప్రకారం క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్‌లు షాపుల్లో ఉండాలి.కానీ,ఇక్కడ క్లీనర్లు, సహాయకులే మందులు ఇస్తున్న దాఖలాలు ఉన్నాయి.అధికారుల ఉదాసీనత వల్లే మెడికల్ మాఫియా రెచ్చిపోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే చర్యలు చేపట్టాలిఉన్నతాధికారులు స్పందించి బద్వేలు కేంద్రంలోని అన్ని మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించాలి.పక్కా బిల్లుల విధానాన్ని అమలు చేయాలి.ఎంఆర్పీ ధరల దోపిడీపై ప్రత్యేక నిఘా పెట్టాలి.నిబంధనలు ఉల్లంఘించే షాపుల లైసెన్సులను రద్దు

## ఇందిరమ్మ ఇళ్లకు 77 లక్షల దరఖాస్తులు స్థలం లేనివారికీ మంజూరు

హైదరాబాద్ తెలంగాణ రేవంత్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటివరకు ఇళ్లకోసం దాదాపు 77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడత ఎల్1లో సొంత స్థలం ఉండి ఇళ్లు లేని 23 లక్షల మందిని ప్రభుత్వం ఎంపిక చేసి రూ.6,500 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రెండో విడత మంజూరు చేయనుంది. ఇక స్థలం లేనివారికి ప్రభుత్వ స్థలాల్లో కట్టించాలని భావిస్తోంది.

# ఏ.పీ. ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువులు పంపిణీ పై రైతుల ఆందోళన... తక్షణం నిలిపివేయాలి.

**రైతాంగానికి అవసరమైన అన్ని రకాల ఎరువులను, విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలి.**

**యూరియా మోతాదును రైతాంగం పండించే విస్తీర్ణం ఆధారంగా అందించాలి.**

**వై.యస్. జగన్ సర్కార్ లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందించింది.**

**రైతాంగాన్ని ఆదుకోని నారావారి సర్కార్**

**వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం ఫైర్**




కడప ఏ.పీ.ఎయిమ్స్ యాప్ ద్వారా రైతాంగానికి సరిపడా ఎరువులను వైయస్సార్ కడప జిల్లాలో పంపిణీ చేయకపోవడంతో రైతాంగంలో ఆందోళన, ఆగ్రహం పెళ్ళుబుక్కుతోందని... తక్షణం యాప్ ను నిలిపివేసి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ప్రకారం ఎరువులను పంపిణీ చేయాలని లేకుంటే రైతాంగ ఆగ్రహానికి గురికాక తప్పదని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా రైతు పోరాట సమితి మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కడప నగరంలోని వైయస్సార్ సిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అవసరమైన మేరకు యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయలేక చేతులెత్తేసిందని ఆయన ఎద్దేవా చేశారు. వరి పంటకు సంబంధించి ఒక ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాలు ఎరువులు అవసరం కాగా ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా కేవలం ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో రైతాంగానికి సరిపడక ఆందోళన వ్యక్తపరుస్తోందని తక్షణం ఆ పథకాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాస్త్రవేత్తలు సిఫారసు మేరకు ఒక ఎకరాకు 100 నుంచి 110 కేజీల యూరియాను అధిక దిగుబడుల కొరకు తప్పనిసరిగా వాడాలని కఠినమైన నిబంధనలు ఉండగా,ప్రస్తుత నూతన విధానం ద్వారా కేవలం 60 నుంచి 70 కేజీలు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విరుచుకుపడ్డారు. ఒకవైపు పెరుగుతున్న జనాభాకు ఆహార ఉత్పత్తులను సరఫరా చేయాలంటే రైతులు పండించే పంటలో అధిక దిగుబడులు సాధించాల్సి అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం ఏమిటని? ఆయన నిలదీశారు. రైతులకు కావాల్సిన ఎరువుల మోతాదును చంద్రబాబు సర్కార్ తగ్గించడం, సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో గణనీయంగా సాగు విస్తీర్ణం తగ్గిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలించి అమ్మకాలు కొనసాగిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా ఎరువులు, నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీ రేట్లకే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో రైతాంగం ఉద్యమాలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వై.యస్. జగన్ సర్కార్ లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా, ఎమ్మార్పీ ధరలకే ఏ ఒక్క రైతుకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసి మన్ననలను పొందిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రబాబు సర్కార్ లో పారదర్శకత కొరబడడంతో ఎమ్మార్పీ ధరలకు ఎరువులు అందడం లేదని, కావాల్సిన మేరకు ఎరువులు అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 50,000 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం కాక కేవలం 15,000 మెట్రిక్ టన్నుల ఎరువులే అందుబాటులో ఉన్నాయని ఇది రైతాంగాన్ని ముంచడం, వంచించడం కాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎరువుల పంపిణీలో నూతన విధానం ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా కాకుండా గతంలో మాదిరిగా మాన్యువల్ గా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పంటల విస్తీర్ణాన్ని బట్టి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ఎరువులు ముఖ్యంగా యూరియా, డి ఏ పి మోతాదును తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉంచాలని లేకుంటే ఘననీయంగా దిగుబడి తగ్గే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జెడిఎ తక్షణం జోక్యం చేసుకొని ప్రభుత్వ దృష్టికి తెచ్చి రైతాంగానికి కావలసినంత మేర ఎరువులను తెప్పించి సాగు విస్తీర్ణం తగ్గకుండా అధిక దిగుబడులు సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతాంగం పక్షాన రెడ్యం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్.సి విభాగం అధ్యక్షుడు సింగనమల వెంకటేశ్వర్లు, వైయస్సార్ సిపి జిల్లా విద్యార్థి భాగం ప్రధాన కార్యదర్శి పితాంబరి మహేశ్వరరెడ్డి, వైయస్సార్ సిపి బిసి నేత మునెల్లి వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అల్పాహారం -- పాలు పథకం ప్రారంభం

## రాజ్‌భవన్‌ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన మంత్రిపొన్నం ప్రభాకర్



వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహారం -- పాలు పథకాన్ని హైదరాబాద్‌లోని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్వినీ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 29 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం -- పాలు పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడుతున్నామని తెలిపారు.

ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా "బడిబాట" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యను మధ్యలో మానేసిన విద్యార్థులను తిరిగి బడుల్లో చేర్పించడం, ఇతర పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను కొనసాగించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

అల్పాహారం -- పాలు పథకం అమలుకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల సహకారంతో దాదాపు రూ.800 కోట్లు వ్యయం చేస్తోందని తెలిపారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు.

ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ తరగతులు కూడా ప్రారంభిస్తున్నామని, చిన్నారులు పాఠశాలలోనే అల్పాహారం తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు.

విద్యార్థులు ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు హాజరై అల్పాహారం, మధ్యాహ్న భోజనం తీసుకుంటూ విద్యలో రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా మరింత కష్టపడి చదివి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని కోరిన మంత్రి, ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలు చేపడుతోందన్నారు. విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రీ-ప్రైమరీ (గ్రా) నుంచి ఇంటర్మీడియట్ (12వ తరగతి) వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ అల్పాహారం పథకం వర్తిస్తుంది.

ఈ పథకం ద్వారా:

విద్యార్థుల్లో ఆకలిని నివారించడం

పోషకాహార లోపాన్ని తగ్గించడం

ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడటం

పాఠశాల హాజరును పెంచడం

డ్రాప్‌అవుట్‌లను తగ్గించడం

విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ప్రతిభను మెరుగుపరచడం

వంటి లక్ష్యాలను ప్రభుత్వం సాధించనుంది.

రోజు అల్పాహారం పాలు/రాగి మాల్ట్ ఇస్తున్నాం..

సోమవారం దోసె - చట్నీ / చపాతీ - కూర పాలు

మంగళవారం మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ రాగి జావ

బుధవారం పూరీ (2) - ఆలూ కుర్మా పాలు

గురువారం మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ రాగి జావ

శుక్రవారం మిల్లెట్ ఉప్మా / పొంగల్ - చట్నీ పాలు

శనివారం బొండా (2) - చట్నీ రాగి జావ

సోమ, బుధ, శుక్రవారాలు -- పాలు

మంగళ, గురు, శనివారాలు -- రాగి జావ

అల్పాహారం కోసం ప్రభుత్వం వార్షిక వ్యయం రూ. 540 కోట్లు ఖర్చు చేస్తుంది

పాల సరఫరా కోసం వార్షిక వ్యయం: రూ. 180 కోట్లు ఖర్చు చేస్తుంది..

మొత్తం వార్షిక వ్యయం రూ. 720 కోట్లు ఈ పథకానికి ప్రభుత్వం ఖర్చు చేయనుంది..

ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, విద్యా నాణ్యతను పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది..

హైదరాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ -- అల్పాహార పథకం (2026-27) సంక్షిప్త నోట్

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార స్థాయిని మెరుగుపరచే లక్ష్యంతో 2026-27 విద్యా సంవత్సరం నుంచి అల్పాహార (దీతీమఖఎఆఖర్) పథకాన్ని అమలు చేయనుంది.

హైదరాబాద్ జిల్లాలో జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

మొత్తం 93,501 మంది విద్యార్థులు చదువుతున్నారు.

మొదటి దశ అల్పాహారం కింద హైదరాబాద్ జిల్లాలో 45 పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయి.

ఈ పథకం ద్వారా 12,437 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

మన్నా ట్రస్ట్ (మీఱఅఖ ుతీబర్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుంది.

ప్రాథమిక పాఠశాలలు: 23 (5,258 మంది విద్యార్థులు)

ఉన్నత ప్రాథమిక పాఠశాలలు: 2 (175 మంది విద్యార్థులు)

ఉన్నత పాఠశాలలు: 20 (7,004 మంది విద్యార్థులు)

విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ఈ క్రింది ఆహార పదార్థాలు అందించబడతాయి:

ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యం, పాఠశాల హాజరు, ఏకాగ్రత మరియు విద్యా ఫలితాలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

# పాపం షర్మిళ... ఏటీ చేద్దాం



కడప, జూన్ 15 వైయస్ షర్మిల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆవేదనతో ఉన్నారా? తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? తనకు రాజ్యసభ పదవి ఇవ్వకపోవడంపై కొందరి హస్తం ఉందన్న అనుమానాలు ఆమెలో ఉన్నాయా? అందుకే ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. కొద్ది రోజుల కిందట కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిలను ఎంపిక చేస్తారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆమెను ఢిల్లీ పిలిచి కాంగ్రెస్ అగ్ర నేతలు అభయం కూడా ఇచ్చారట. కానీ ఇంతలోనే సమీకరణలు మారిపోయాయి. చివరి నిమిషంలో షర్మిల పేరు లేకుండా పోయింది. అయితే కాంగ్రెస్ పార్టీ కోసం తాను నిలబడితే.. పార్టీ మాత్రం ఇచ్చిన మాట కట్టుబడి ఉండలేదన్న ఆవేదన షర్మిల లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బాధతోనే రెండు రోజుల కిందట ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరైనట్లు తెలుస్తోంది.2024 ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. కానీ వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు తన పార్టీని. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే ఏపీలో పార్టీ బాధ్యతలు తీసుకుంటే రాజ్యసభకు అవకాశం ఇస్తామని.. అది కూడా కర్ణాటక నుంచి ఛాన్స్ కల్పిస్తామని అప్పట్లో అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ హామీ ఇచ్చారు. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె కృషి చేస్తూ వచ్చారు. కర్ణాటక నుంచి రాజ్యసభ పదవులు ఖాళీ అయ్యాయి. అక్కడినుంచి ఛాన్స్ దక్కుతుందని భావించారు షర్మిల. అందుకు తగ్గట్టుగానే ఢిల్లీ నుంచి సమాచారం రావడంతో వెళ్లి వచ్చారు. నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో కాంగ్రెస్ హై కమాండ్ హ్యాండిచ్చింది. అయితే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారానే.. తనకు రాజ్యసభ పదవి రాకుండా కుట్ర జరిగిందన్నది షర్మిల లో ఉన్న అనుమానం.ప్రధానంగా కర్ణాటక కాంగ్రెస్ నేతలతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన బెంగుళూరులో తన రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు అదే కర్ణాటక కాంగ్రెస్ నేతలతో కలిసి జగన్మోహన్ రెడ్డి తనకు రాజ్యసభ పదవి రాకుండా అడ్డుకున్నారన్న అనుమానం షర్మిల లో ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా ఇటీవల ఆమె ఒక ట్వీట్ చేసినట్లు తెలుస్తోంది. పైగా జగన్మోహన్ రెడ్డిని మచ్చిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న అనుమానాలు కాంగ్రెస్ హై కమాండ్ పై ఉన్నాయి. ఈ అనుమానాలతోనే ఆమె కాంగ్రెస్ హై కమాండ్ పై రగిలిపోతున్నారు. అందుకే కీలకమైన ఇండియా కూటమికి గైర్హాజరయ్యారు. ఇదే పరిణామాలు కొనసాగితే షర్మిల తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# మాజీ ఐపీఎస్ వర్సెస్ మాజీ ఎంపీ...

## రసకందాయంలో రాజకీయం

రాజమండ్రి, జూన్ 15 ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ సమావేశానికి ఒక్క పీవీ సునీల్ కుమార్‌కు మాత్రమే ఎందుకు ఆహ్వానం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అందువల్లే ఆయన్ను ప్రభుత్వం అరెస్ట్ చేయలేక పోతుందేమోనని, ఆయన ఎక్కడ మీటింగ్ పెట్టినా ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు.గతంలో ఆర్ఎస్ఎస్ సమావేశానికి హాజరై.. అక్కడ తాను గ్రహించిన విషయాలను ఫిబ్రవరి 10న పీవీ సునీల్ కుమార్ ఫేస్ బుక్‌లో పోస్టు చేశారు. ఆ పోస్టు స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన హర్ష కుమార్.. ఆయన ఆర్ఎస్ఎస్ అని అర్థమైపోతుందన్నారు. అనంతరం ఫేస్ బుక్‌లో వీడియో పోస్టు చేసిన హర్ష కుమార్.. ముందు జాగ్రత్తగా జాతిని హెచ్చరిస్తూ తాను ఈ పోస్టు చేశానన్నారు."పీవీ సునీల్ నాకు బాగా తెలిసినాయనే. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఆయన ఒకసారి నా దగ్గరికి వచ్చారు. గుంటూరు ఐజీ ఖాళీగా ఉందని, వేయించమని కోరారు. నేను సీఎంతో మాట్లాడి వేయించాను. వేయించలేదని బైబిల్ పట్టుకొని ప్రమాణం చేయమని సునీల్ కుమార్‌ను చెప్పమనండి. తర్వాత మా మధ్య సంబంధాలు లేవు. రఘురామకృష్ణను కొట్టినప్పుడు.. అది తప్పు కాబట్టి నేను రఘురామ వైపు మాట్లాడి .. సునీల్ కుమార్ తీరును తప్పుబట్టాను. పీవీ సునీల్ కుమార్ ఆర్ఎస్ఎస్ గురించి చేసిన పోస్టును ఎవరో నాకు పంపించారు. బౌద్ధ ఆచారాల ప్రకారం సునీల్ కుమార్ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారని నాతో ఒకరు చెప్పారు. దీంతో చింతలపూడిలో నాకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి అడిగితే.. బౌద్ధ సంప్రదాయం ప్రకారం సునీల్ తండ్రి అంత్యక్రియలు చేసిన మాట నిజమేనని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఇతణ్ని ప్రమోట్ చేస్తుందనే అనుమానం వచ్చేలా నాకు చాలా పోకడలు కనిపించాయి. అందుకే జాతిని ముందే మేల్కొలపాలనే ఉద్దేశంతోనే ఈ పోస్టు పెట్టాను. సునీల్ కుమార్ తన భార్యను హింసించడంతో ఆమె కేసు పెట్టింది. ఆయనపై ఆర్ఆర్ఆర్‌వి కాకుండా చాలా కేసులు ఉన్నాయి' అని హర్ష కుమార్ వ్యాఖ్యానించారు.మాజీ ఎంపీ హర్ష కుమార్ చేసిన పోస్టు పట్ల సునీల్ కుమార్ పరోక్షంగా స్పందించారు. 'పైకి ట్రిపుల్ ఆర్ (రఘురామ కృష్ణరాజు)తో పోరాడుతున్నట్లు నటిస్తూ.. అతని ఏజెంట్లుగా పని చేస్తున్నవాళ్లు దొరికిపోతున్నారు. వీళ్లను ఏం చేయాలో జాతికి తెలుసు' అని సునీల్ కుమార్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.ఈ పోస్టు కింద సునీల్‌కుమార్‌అభిమానులుచేస్తున్న కామెంట్స్ ను బట్టి ఆయన చేసిన ఈ పోస్టు హర్షకుమార్‌నుఉద్దేశించేదనని అర్థమవుతోంది. 'కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రణబ్ ముఖర్జీ లాంటి పెద్ద పెద్ద లీడర్లు సైతం ఆర్ఎస్ఎస్ ఆహ్వానం మేరకు ఆర్ఎస్ఎస్ సభలకు హాజరయ్యారని.. అంత మాత్రాన ప్రణబ్ ముఖర్జీ బీజేపీ మనిషి అయ్యారా? అప్పుడు హర్ష కుమార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వారిని విమర్శించలేని హర్ష కుమార్ గత చరిత్ర మరచి పీవీ సునీల్ గారి మీద బురద జల్లుతున్నారు. హర్ష కుమార్, ఆయన కుమారుడి రాజకీయ పీఠాలు కదులుతాయని భయమా? లేదా ఆర్ఆర్ఆర్‌కు కోవర్టులుగా పని చేస్తున్నారా?' అని ప్రభుదాస్ అనే వ్యక్తి పీవీ సునీల్ కుమార్ పోస్టు కింద కామెంట్ చేశారు.పీవీ సునీల్ కుమార్ ఇటీవల భీమవరం సభలో మాట్లాడుతూ.. చర్చికి వెళ్లినంత మాత్రాన, ఇంట్లో బైబిల్ ఉన్నంత మాత్రం క్రిస్టియన్లు కారని.. బాప్టిజం తీసుకున్న వారే క్రైస్తవులు అవుతారని వ్యాఖ్యానించారు. తన తండ్రి అంత్యక్రియలను క్రైస్తవ పద్ధతిలోనే చేశానని.. దమ్ముంటే తన ఎస్సీసర్టిఫికెట్‌రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ మీటింగ్ సక్సెస్ కావడంతో రఘురామ కోవర్టులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారని ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

## సత్తుపల్లి, కొవ్వూరు

## కొత్త లైన్ తో తగ్గనున్న దూరం

ఏలూరు, జూన్ 15, తెలుగు రాష్ట్రాల మధ్య ప్రతిష్ఠాత్మకమైన సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా రైల్వే బోర్డును కోరింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైల్వే శాఖకు భారీగా ఆదాయం సమకూరుతుందని, వ్యయంతో పోలిస్తే వచ్చే రాబడి 14 శాతానికి పైగానే ఉంటుందని ఏపీ ప్రభుత్వం తాజా నివేదికలో స్పష్టం చేసింది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు ఎఫ్ఐఆర్ఆర్ 10 శాతానికి పైగా ఉంటేనే రైల్వే శాఖ లాభసాటిగా భావిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి వాటా ఆశించకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే దీనిని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం రైల్వే బోర్డు ముందు ప్రతిపాదించింది.నిజానికి భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) నుంచి కొవ్వూరు వరకు రైల్వే లైన్ ప్రాజెక్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మంజూరైంది. అప్పట్లో ఈ ప్రాజెక్టు వ్యయంలో సగం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని రైల్వే శాఖ షరతు విధించింది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు నిధులు వెచ్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రాలేదు. మరోవైపు సింగరేణి కాలరీస్ గనుల నుంచి బొగ్గు రవాణాను సులభతరం చేసేందుకు తెలంగాణ పరిధిలోని భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు ఇప్పటికే రైల్వే లైన్ నిర్మించారు. ఇప్పుడు సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు మిగిలిన 118.9 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మిస్తే ఈ కీలక అనుసంధానం పూర్తవుతుందని ఏపీ ప్రభుత్వం వివరిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్గంలో ఏపీ పరిధి 70.31 కిలోమీటర్లుగా ఉంది.ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో ఏపీ ప్రభుత్వం సగం నిధులు ఇవ్వాలని లేదా కనీసం భూసేకరణ వ్యయాన్నైనా భరించాలని రైల్వే శాఖ గతంలో పట్టుబట్టింది. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఈ ప్రాజెక్టును కేంద్రమే చేపడుతుందని స్పష్టమైన హామీ ఉన్నందున.. రైల్వే శాఖే పూర్తి నిధులు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ లైన్ సాకారమైతే కొత్తగూడెం, మణుగూరు ప్రాంతాల్లోని సింగరేణి గనుల నుంచి సేకరించే బొగ్గును కాకినాడ పోర్టుకు తరలించడానికి రైలు మార్గంలో సుమారు 140 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు భారీగా తగ్గడమే కాకుండా... సమయం కూడా ఆదా అవుతుంది. పారిశ్రామికంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున భూసేకరణతో పాటు అన్ని రకాల పరిపాలనాపరమైన సహకారం అందిస్తామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కేడర్ లో నిర్లేపం, నిక్షిప్తత

విజయవాడ,, జూన్ 15, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతుంది. తాము సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని చంద్రబాబు, లోకేశ్ లు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హామీల అమలు మాత్రం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు మరో పదిహేనేళ్లు తిరుగులేదంటూ జబ్బలు చరుచుకుంటున్నా జగన్ ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్నది మాత్రం నాయకత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకత్వం గతంలో మాదిరిగా ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే నివేదికలపైనే ఆధారపడి ఆల్ ఈజ్ వెల్ అని ఫీలవుతుంది.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమలు వస్తున్నాయి. అందులో ఎవరూ కాదనలేరు. కానీ ఎవరూ అభివృద్ధిని చూసే ఓటేయరు. సంక్షేమం అందరికీ అందడం లేదు. నిధుల కొరత కారణంగా, అధికారులు కొర్రీలు పెడుతూ చాలామందికి కోతలు పెట్టారు. హామీలు అన్ని అమలు పర్చామంటూ డప్పాలు కొట్టుకుంటే సరిపోదు. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే చాలు జరుగుతున్న తప్పులు సరిదిద్దుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎమ్మెల్యేల సమావేశం పెట్టినా, కార్యకర్తలతో మీటింగ్ లు పెట్టినా చెప్పడమే తప్ప వినడం తక్కువ కావడంతో వారి నుంచి ఫీడ్ బ్యాంక్ తీసుకోకపోవడమే ప్రధాన సమస్య.

# దువ్వాడ దారెటు...



విజయనగరం , జూన్ 15, రీల్స్ "రాజా" పరిస్థితి దారుణంగా మారిపోయింది. పుట్టింటి వాళ్ళు వదిలేశారు. నమ్ముకున్న పార్టీ తరిమేసింది.. అన్నట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. తాడేపల్లి నుంచి క్లియర్ మెసేజ్ వచ్చింది. రీ ఎంట్రీ లేదని అన్ని మూసుకొని కూర్చోవాలని.. పార్టీ అధిష్టానం చెప్పేసింది. ఇప్పుడు ఏం చేయాలి.. చీరలు అమ్ముకుంటూ.. రీల్స్ చేసుకుంటూ బతకాలి.. ఇది ఆ సిట్టింగ్ ఎమ్మెల్సీ పరిస్థితి.ఉత్తరాంధ్రలో దువ్వాడ శ్రీనివాస్ కు ఒకప్పుడు భారీగానే ఫాలోయింగ్ ఉండేది. ఫ్యాన్ పార్టీలో ఆయన ఎమ్మెల్సీ కూడా. ఆయన జీవితంలోకి మాధురి రావడంతో పరిస్థితి మారిపోయింది. రాజకీయంలో హత్యలు ఉండవు ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి అనే సామెత అతని ద్వారా మరోసారి నిరూపితమైంది. భార్యను.. ఇద్దరి పిల్లల్ని వదిలిపెట్టి ఆయన తన దారితను చూసుకున్నాడు. వృద్ధాప్యంలో యవ్వనం లాగా.. పడుచు కుర్రాడి లాగా రెచ్చిపోతున్నాడు. మాధురితో రీల్స్ చేయడం.. టీవీ చానల్స్ లలో ముద్దులు పెట్టడం.. ఇలా రకరకాల హంగామా చేస్తున్నాడు.దీనివల్ల 2024 లో పార్టీకి చాలావరకు డ్యామేజ్ జరిగింది. టెక్కలి నియోజకవర్గం లోనే కాకుండా.. ఉత్తరాంధ్ర మొత్తంలో పార్టీకి పెద్ద దెబ్బ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అప్పటికప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏమి చెప్పకపోయినప్పటికీ.. వచ్చి కలువు అన్నారు. అయితే ఇంతవరకు అపాయింట్మెంట్ దొరకలేదు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి క్లియర్ మెసేజ్ వచ్చేసింది. రీ ఎంట్రీ లేదని స్పష్టంగా వర్తమానం అందింది.వైసీపీలోకి మళ్ళీ వెళ్లడానికంటే ముందు శ్రీనివాస్ బిజెపి.. టిడిపి.. జనసేన నాయకులతో మంతనాలు జరిపారు. పార్టీలో చేర్చుకోవాలని వర్తమానం పంపించారు. ఏ పార్టీ నుంచి కూడా సరైన స్థాయిలో స్పందన రాలేదు. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ గేటు కాదు కదా కనీసం ప్రహరీ గోడ కూడా టచ్ చేయడానికి అవకాశం లేదని వర్తమానం అందడంతో శ్రీనివాస్ అంతర్మదనంలో ఉన్నారు. ఆయన సన్నిహితురాలు ప్రస్తుతం హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆయన కూడా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అన్ని పార్టీలు డోర్లు క్లోజ్ చేయడంతో.. శ్రీనివాస్ ఏం చేస్తారు.. ఇండిపెండెంట్గా రంగంలోకి దిగుతారా.. లేక రీల్స్ చేసుకుంటూ.. సోషల్ మీడియా ఛానల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటూ వెళ్తారా అనేది చూడాల్సి ఉంది..

## అక్బర్ బాగ్ లో ఉద్రిక్తత
## హిందూ సంఘాల అందోళన

హైదరాబాద్ పాతబస్తీ చదర్ ఘట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్బాగ్లో బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో బట్టలు ఆరేయడాన్ని దేవాలయానికి చెందిన కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కొందరు యువకులు దేవాలయ కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడి చేశారు.

ఈ ఘటన తెలుసుకున్న హిందూ సంఘాలు వందల సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ నాయకులు వీరేందర్ యాదవ్, వినోద్, నరసింహ, రాజేష్, బి ర్ స్ నాయకులు శ్రీధర్ రెడ్డి, బస్తి వాసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితుల

ఫిర్యాదు తో చదర్ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.అక్బర్ బాగ్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి దేవాలయం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు....

# నిల్వ దాన్యాలను తరలించలేదు
# అందోళనలో రైతన్నలు

వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో వరి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం ఇంకా తరలించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి యాలాల మండల కేంద్రంలోని కాగ్నా జలాల ఎఫ్పీఓ వరి కొనుగోలు కేంద్రంతో పాటు బెన్నూర్ వరి కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన వరి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.పంటను ఎంతో శ్రమించి పండించిన రైతులు ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా కాపాడుకునేందుకు రాత్రంతా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోయి రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త సాగుకు పొలాలను చదును చేసుకునే సమయం ఆసన్నమైందని, అయితే ధాన్యం ఇంకా కేంద్రాల్లోనే ఉండటంతో తదుపరి వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

"మరికొన్ని రోజులు ఇలాగే కేంద్రాల వద్దే వేచి చూడాలా? ఇంకెప్పుడు ధాన్యాన్ని తరలిస్తారు?" అంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తడిసిన ధాన్యానికి నష్టం కలగకుండా వెంటనే బస్తాలను తరలించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కేంద్రాల్లో నిల్వ ఉన్న బస్తాలను అత్యవసరంగా తరలించాలని రైతులు కోరుతున్నారు.

# అర్ధరాత్రి రైలులో దొంగల బీభత్సం..
# పోలీసులపై ఎదురుకాల్పులు!

బాపట్ల జిల్లాలో అర్ధరాత్రి రైలులో దొంగలు బీభత్సం సృష్టించారు. చెంగల్పట్టు నుంచి కాకినాడ వెళ్తున్న సర్కార్ ఎక్స్ప్రెస్ పై అప్పికట్ల–మాచవరం మధ్య 2:30 సమయంలో దుండగులు దాడి చేశారు. ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు లాక్కున్నారు. బాధితులు కేకలు వేయడంతో చైన్ లాగి పరారయ్యారు. వీరిని అడ్డుకునేందుకు ఉఖీఖ పోలీసులు కాల్పులు జరపగా, దొంగలు కూడా ఎదురుకాల్పులు చేశారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

# ఆరు బస్సులను సీజ్ చేసిన అధికారులు

## స్కూల్ బస్సులపై రంగారెడ్డి జిల్లా
## రవాణా శాఖ అధికారుల దాడులు

రంగారెడ్డి సోమవారం నుండి ప్రైవేట్ పాఠశాలలు పున ప్రారంభం కావడంతో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సుల పై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. బస్సు కు సంబంధించిన ఆర్సి పర్మిట్ ఇన్సూరెన్స్ ఫిట్నెస్ పొల్యూషన్ తో పాటు డ్రైవర్ లైసెన్స్ చెక్ చేస్తున్నారు. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులో సేఫ్టీల విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు. బస్సులో ఉండాల్సిన ఫైర్ పరికరాలు, మెడికల్ కిట్ విద్యార్థుల లిస్ట్ తోపాటు అనుభవం కలిగిన డ్రైవర్ బస్సు నడుపుతున్నాడు అనే విషయాలను పరిశీలిస్తున్నారు. 60 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లు ఉన్నారని కోణంలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు.

# వీడని జ్ఞానేశ్వరి అదృశ్యం మిస్టరీ..
# రంగంలోకి పవన్!



కాకినాడ, జూన్ 15, కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. : చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన మిస్టరీ ఇంకా వీడడం లేదు. ఆ చిన్నారి అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తోంది. వందలాది మంది పోలీసులు జల్లెడ పడుతున్నారు. కానీ ఇంతవరకు ఆచూకీ లేదు. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై ఆరా తీసారు. కాకినాడ ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కనుకునేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీస్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో పాటు ఎన్టీఆర్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. దట్టమైన అడవుల్లో సైతం వెళ్ళగలిగే అటవీ శాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంపు వాచర్స్, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని కూడా ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్.కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు పలుమార్లు గాలింపు చర్యలు చేపట్టినా చిన్నారి ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. చిన్నారి కనిపించకుండా పోయినప్పటి నుంచి ఆమె కోసం అన్ని దిశల్లో అన్వేషణ కొనసాగుతోంది. పాప సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న అధికారులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన హనుమాన్ టీం రంగంలోకి దిగింది. నిన్న అర్ధరాత్రి నుంచే అటవీ ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించిన బృందాలు అడవిలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. చిన్నారి జాడ కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రెండు థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. రాత్రి సమయంలో కూడా స్పష్టమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ డ్రోన్లు సహాయపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా అడవిలోని పొదలు, లోయలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు, హనుమాన్ టీం సభ్యులు కలిసి విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగిస్తున్నారు. చిన్నారి ఎక్కడైనా చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో ప్రతి ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.అటవీశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, ఆ ప్రాంతంలో మనుషులపై దాడి చేసే క్రూర జంతువులు ఉండే అవకాశం చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. దీంతో చిన్నారి క్షేమంగా ఉండే అవకాశాలపై ఆశాభావం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం కొనసాగుతున్న ఈ సెర్చ్ ఆపరేషన్పై స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే పాప జాడ లభించాలని అందరూ ప్రార్థిస్తున్నారు.

పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి..

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. 8 రోజులు దాటుతున్న ఆచూకీ దొరకకపోవడంతో పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాదాపు 400 మంది పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు పాల్గొంటున్నారు. అత్యాధునిక డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. చిన్నారితో పాటు కనిపించకుండా పోయిన కుక్క ప్రత్యక్షం కావడంతో.. దానికి జిపిఆర్ఎస్ కట్టి అడవుల్లో వదిలారు.. అయినా సరే ఎటువంటి ఫలితం లేకపోయింది. అయినా సరే ప్రయత్నాల్లో ఉంది పోలీస్ శాఖ. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపారు. కాకినాడ ఎస్పీకి నేరుగా ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అయితే పోలీస్ శాఖ గత ఎనిమిది రోజులుగా చేపట్టిన దర్యాప్తును వివరించారు కాకినాడ జిల్లా ఎస్పీ. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించామని ఎస్పీ వివరించారు. కాగా జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో కీలకంగా మారిన పెంపుడు కుక్క ఊహించని రీతిలో చనిపోయింది. గత రెండు రోజులుగా విచిత్రంగా ప్రవర్తించిన ఆ కుక్క.. చివరకు శనివారం చనిపోయింది. చిన్నారితో పాటుగానే ఈ కుక్క కనిపించకుండా పోయింది. నాలుగు రోజుల కిందట తిరిగి వచ్చింది. చిన్నారి ఇంటి వద్దకు చూసి కంగారుతో అడవిలోకి పారిపోయింది. అతి కష్టం మీద ఆ కుక్కను బంధించారు. ఆ కుక్కకు జిపిఎస్ ట్రాకర్ అమర్చి చిన్నారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కాగా.. శనివారం కుక్క సైతం చనిపోవడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# హ్యాట్రిక్ పై యోగి గురి

లక్నో, జూన్ 15, (న్యూస్ పల్స్) భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. గతంలో లాగా కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే యోగి ఆదిత్యనాథ్ తామే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతారని పార్టీ జాతీయ నాయకత్వం అధికారికంగా ప్రకటించడం గమనార్హం.

గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సాధించిన విజయాలకు బ్రేక్ వేయడమే కాకుండా, విపక్షాల ఓటు బ్యాంకును ముక్కలు చేసేందుకు యోగి మార్క్ పొలిటికల్ స్కెచ్ సిద్ధమైంది.అఖిలేష్ యాదవ్ విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన ఖఅం పిడ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ – వెనుకబడిన, దళిత, మైనారిటీల కూటమి ఫార్ములాను దెబ్బతీయడమే యోగి ప్రధాన ఎజెండా. దీనికోసం ఇటీవల యూపీ క్యాబినెట్‌ను విస్తరిస్తూ ఆరుగురు కొత్త మంత్రులతో యోగి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ విస్తరణ వెనుక పక్కా సోషల్ ఇంజనీరింగ్ దాగి ఉంది. సమాజ్ వాదీ పార్టీ బలంగా నమ్ముకునే యాదవేతర ఓబీసీ , దళిత సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో పెద్దపీట వేయడం ద్వారా అఖిలేష్ యాదవ్ ఓటు బ్యాంకు పునాదులను కదిలించేలా యోగి వ్యూహాత్మక అడుగులు వేశారు. ఎస్పీ సాంప్రదాయ ఓటు బ్యాంకు అయిన యాదవేతర వెనుకబడిన కులాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా అఖిలేష్ ఖఅం ముసుగును తొలగించాలని యోగి ప్లాన్ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీలో యాదవుల ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్న ఇతర ఓబీసీ ఉప-కులాలను మౌర్య, కుర్మీ, నిషాద్, రాజ్‌భర్ వంటి వర్గాలను బీజేపీ తన వైపు తిప్పుకుంటోంది. ఇందుకోసం చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలతో పొత్తులను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఆయా సామాజిక వర్గాల చివరి లబ్ధిదారుడికి చేరేలా యోగి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కుల సమీకరణాలతో పాటు రాష్ట్రాన్ని కుదిపేసే క్రైమ్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయడం ద్వారా శాంతిభద్రతల అంశాన్ని మరోసారి తన ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారు.ఇక రాజకీయంగా విపక్షాలను డిఫెన్స్‌లో పడేసేందుకు యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన పాత వైభవమైన 'హార్డ్ హిందుత్వ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఇటీవల కుషీనగర్, గొండాలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన నేరుగా సమాజ్ వాదీ పార్టీని రామ విరోధులు గా అభివర్ణించారు. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు దశాబ్దాల పాటు అయోధ్య రామందిర నిర్మాణాన్ని అడ్డుకున్నాయని, 500 ఏళ్ల హిందువుల నిరీక్షణకు డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే ముగింపు పలికిందని గుర్తు చేశారు. అఖిలేష్ యాదవ్ ఇటీవల అవలంబిస్తున్న సాఫ్ట్ హిందుత్వ పాలిటిక్స్‌ను యోగి తీవ్రంగా ఎండగడుతున్నారు. అభివృద్ధి జాతీయ భద్రత అనే అంశాలను కూడా యోగి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు అల్లర్లకు, మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు బ్రహ్మోస్ మిసైల్ తయారీ కేంద్రాలు వస్తున్నాయని, పాకిస్తాన్‌ను సైతం గడగడలాడించే రక్షణ పరిశ్రమలు యూపీ గడ్డపై ఏర్పాటవుతున్నాయని ఆయన చెప్పుకొస్తున్నారు. నవ్య అయోధ్య, కాశీ విశ్వనాథ్ కారిడార్ ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించామని, గతంలో జరిగిన పరీక్షల పేపర్ లీకేజీల నిందితులను జైలుకు పంపామని వివరిస్తున్నారు.అఖిలేష్ యాదవ్ కులాల వారీగా ఓట్లను ఏకం చేసే ప్రయత్నం చేస్తుంటే.. యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆ ఓట్లను చీలుస్తూ హిందూ ఓటు బ్యాంకును ఏకం చేస్తూనే, యాదవేతర వెనుకబడిన వర్గాలను అధికారంలో భాగస్వాములను చేసే ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గడిచిన రెండు ఎన్నికల కంటే కూడా 2027 లో యూపీ అసెంబ్లీలో భారీ మెజార్టీతో బీజేపీ తిరిగి పీఠాన్ని దక్కించుకుంటుందని యోగి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రూరమైన పొలిటికల్ మైండ్ గేమ్‌లో అఖిలేష్ యాదవ్ యోగి స్పీడ్‌ను ఎంతవరకు తట్టుకుంటారనేది రాబోయే రోజుల్లో తేలనుంది.


# నోరు.. అండర్ వేరూ.. ప్రతీ చోట కాపీ

లక్నో,జూన్ 15, ఉత్తర ప్రదేశ్ ఒకటి. ప్రస్తుతం అక్కడ పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి ఎంపిక పరీక్షలు జరుగుతున్నాయి.. ఉత్తరప్రదేశ్ పెద్ద రాష్ట్రం కాబట్టి సహజంగానే నిరుద్యోగ సమస్య అధికంగా ఉంటుంది. పైగా చాలా రోజుల తర్వాత అక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో భారీగానే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.. ఇప్పటికే శారీరక దారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. రాత పరీక్షలు నడుస్తున్నాయి. రాత పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. పరీక్ష నిర్వహిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకు దారితీస్తోంది.ఉత్తర్ ప్రదేశ్ లోని జౌన్ పూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో నిర్వహించిన తనిఖీలు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. అక్కడ డిటెక్టర్ తో ప్రతి అభ్యర్థిని తనిఖీ చేస్తున్నారు. ఒక అభ్యర్థి తన అండర్వేర్లో ఫోన్ పెట్టుకుని వచ్చాడు. అది కాస్త డిటెక్టర్ ద్వారా చేసిన తనిఖీల్లో బయటపడింది. దీంతో అభ్యర్థులను ముందుగా అండర్వేర్లో డిటెక్టర్ పెట్టి పరీక్షిస్తున్నారు. ఆ తర్వాత దానిని నోట్లో కూడా పెడుతున్నారు. అండర్వేర్ నుంచి నోరు వరకు దేనిని వదలకుండా డిటెక్టర్ పెడుతుండడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటికి నోరు మెదపకపోయినప్పటికీ.. ఉద్యోగం కావాలి కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో దానిని తట్టుకుంటున్నారు."ఉద్యోగం సాధించాలంటే కష్టపడాలి. అందులో తప్పులేదు. కానీ ఇలా అండర్వేర్ లో డిటెక్టర్ పెట్టి మళ్ళీ దానిని నోట్లో పెడితే దానిని ఏమనుకోవాలి.. అసలు ఇలా తనిఖీ చేస్తారా.. దీనిని తనిఖీ అంటారా.. ఇంతగనం ఇబ్బంది పెడితే ఎలా పరీక్ష రాయాలి.

పరీక్ష రాయడానికి వచ్చిన వారంతా కూడా పేద, మధ్య తరగతివారే.

వారికి ఉద్యోగం కావాలి కాబట్టి ఇదంతా భరిస్తున్నారు. కానీ ఇంత ఇబ్బంది పడుతూ ఉద్యోగం సాధించడం అవసరమా అనిపిస్తోందని" సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# ఒకే కుటుంబంలోని ముగ్గురు ఆత్మహత్య






నెల్లూరు సంగం మండలం దువ్వూరు గ్రామంలో విషాదం నెలకొంది. ఇంట్లో రిటైర్డ్ టీచర్ మధు కుటుంబం ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని..విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరణ వాంగ్మూలం బీరువాలోని ఫోటో అల్బంలో వుందని ఒక చీటి రాసి బిరువాకు అతికించారు.

# దూకుడు ప్రదర్శించని బీఆరెస్

హైదరాబాద్, జూన్ 15, తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి-అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది. ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ.. రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది.బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ-బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్‌లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్‌లైన్, ఆన్‌గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి.

అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక 'బి-టీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే.. బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి.

లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.

# నిధుల్లేక నీరసిస్తున్న పాఠశాల పనులు

నల్గొండ, జూన్ 15, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన 'మన ఊరు - మన బడి' బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాం లో చేసిన పనులకు సంబంధించి రూ. 300 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్.. గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు చెల్లించింది. విడుదల చేసిన దాంట్లోనూ రూ. 46 కోట్లు ఓ పెద్ద కంపెనీకే ఇచ్చిందని చిన్న కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పను లు చేపట్టి మూడేళ్లవుతున్నా బిల్లులు రాకపోవడంతో చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో మన ఊరు - మన బడి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9 వేల ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నిర్మాణ పనులు చేపట్టింది. దాదాపు వెయ్యి మంది కాం ట్రాక్టర్లు ఈ పనులు చేశారు. డైనింగ్ హాల్, మ రుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రికల్ వంటి మైనర్ పనులను చిన్న కాంట్రాక్టర్లు అప్పగించగా, పేయంటింగ్, స్మార్ట్ క్లాస్‌లకు సంబంధించి డిజిటల్ బోర్డులు ఏర్పాటు తదితర పెద్ద పనులను ఓ బడా కంపెనీకి ఇచ్చారు. వెయ్యి మంది కాంట్రాక్టర్లలో రూ.10 లక్షల లోపు పనులు చేసిన వారు 600 మంది వరకు ఉంటారు.ఇందులో రూ.5 లక్షల లోపు పనులు చేసిన వాళ్లకు దాదాపు రూ.141 కోట్లు, రూ.5- 10 లక్షల లోపు రావాల్సిన బిల్లులు రూ.75 కోట్లు, రూ.10-30 లక్షల లోపు రూ.75 కోట్లు, రూ.30 లక్షలకు పైగా రావాల్సిన బిల్లులు రూ. 50 కోట్లకుపైగా ఉంటాయి. మొత్తం కలిపి చిన్న కాంట్రాక్టర్లకు రూ.350 కోట్ల వరకు చెల్లించా ల్సి ఉంది. ఇందులో రూ.50 కోట్లు విడుదల చేయగా ఇంకా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉం ది. బడా కంపెనీలకు రూ.650 కోట్లకు దాదాపు క్లియర్ చేసినట్లుగా ఓ కాంట్రాక్టర్ తెలిపారు.

# తొమ్మిది రోజులైనా దొరకని చిన్నారి జాను ఆచూకీ



కాకినాడ చిన్నారి జాను జాడ తొమ్మిది రోజులైనా దొరకలేదు. మరోవైపు, జానుతో పాటు వెళ్లి తిరిగొచ్చి చనిపోయిన కుక్కకు పోస్ట్ మార్టం పూర్తి చేసారు. కుక్క శరీరంలో నుండి నమూనాలు సేకరించి విశాఖపట్నంలోని ఫోరెన్సిక్ ల్యాబ్కు పంపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మరో 30 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. చుట్టుపక్కల 7 టవర్ల పరిధిలో 4800 ఫోన్ కాల్స్ విశ్లేషించి, కొందరు అనుమానితులను గుర్తించారు. కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో 9 రోజుల క్రితం అడవిలోకి వెళ్లి తప్పిపోయింది చిన్నారి జాను

# జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి



హైదరాబాద్ జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి చెందారు. మీర్పేట్ పోలీస్ స్టేషన్ సమీపంలో మండమల్లమ్మ చౌరస్తా వద్ద ఆటో పాడైపోయిందని సంతోష్(26) అనే ఆటో డ్రైవర్ తన స్నేహితులు ప్రసాద్, సునీల్(33)లకు సమాచారం ఇచ్చాడు. మండమల్లమ్మ చంద్రా గార్డెన్స్ వద్ద సంతోష్ ఆటోను తన ఆటోకు తాడుతో కట్టి తరలించేందుకు సునీల్, ప్రసాద్ సిద్దమయ్యారు. ఆదే సమయంలో ఎల్బీనగర్ వైపు నుండి వేగంగా వచ్చిన జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా, సునీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

# స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు





అమరావతి సింగపూర్ పర్యటనలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి సింగపూర్లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హజరయ్యారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పుడు భారత్ నిద్రపోతున్న ప్రాంతం కాదు.. సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి. ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టింది. కానీ భారత్కు అంత సమయం పట్టటం లేదు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయి. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయని అన్నారు.

డెమోగ్రాఫిక్ డివిడెంట్తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉంది. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్లో మేం వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నాం. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నాం. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నాం. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు కేటాయించాం. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం. పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిస్తున్నాను. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉంది. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నానని అన్నారు.

# స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు అవ్వండి. కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.

స్వచ్ఛ తిరుపతి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీ, వివేకానంద కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. కాలువల్లో, రోడ్ల పక్కన, కూడళ్ళలో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటిస్తోందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సమన్వయం చేసుకుని స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సహకరించాలని తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి నగర పరిశుభ్రత కు సహకరించాలని పిలుపునిచ్చారు.

# బాలికపై అత్యాచారనీ మరియు హత్యాయత్నం చేసిన గౌస్ ని వెంటనే ఉరి తీయాలి... దుర్గా వాహిని విశ్వహిందూ పరిషత్



హైదరాబాద్ ఖమ్మం లోని 12 ఏళ్ల బాలిక పై 50 ఏళ్ల మహ్మద్ గౌస్ పాషా లైంగిక దాడి చేయడమే కాకుండా మేడ పై నుంచి కిందకు తోసేయడం అత్యంత దారుణమని విశ్వ హిందు పరిషత్ దుర్గా వాహిని ప్రాంత సంయోజిక వాణి సక్కుబాయి అన్నారు.

నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాలికను వాణి సక్కుబాయి , దుర్గా వాహిని ప్రాంత సభ్యులు శిరీష, భవాని గాయత్రీలు పరామర్శించారు. అనంతరం వాణి సక్కుబాయి మాట్లాడుతూ.. బాలిక పై అత్యాచారం చేసిన నిందితుడిని సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి వెంటనే ఉరి తీయాలన్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం తక్షణం అందించాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి యావత్ సమాజం అండగా ఉండాలని తెలిపారు

# కాంగ్రెస్ గూటికి జగన్ !

# చక్రం తిప్పుతున్న రేవంత్

హైదరాబాద్, జూన్ 15, రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఇప్పుడు ఒకదానికొకటి పెనవేసుకుని, అత్యంత ఆసక్తికరమైన చెస్ గేమ్‌ను తలపిస్తున్నాయి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మెల్లగా గళం విప్పుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. జగన్ ప్రధాని మోదీ లేదా కేంద్ర ప్రభుత్వంపై నేరుగా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, కేవలం విధానపరమైన వ్యతిరేకతను మాత్రమే ప్రదర్శిస్తూ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి దక్కాల్సిన రాజ్యసభ సీటు చివరి క్షణంలో సాంకేతిక, రాజకీయ కారణాల వల్ల చేజారడం గమనార్హం. ఈ పరిణామాలు ఏపీలోనే కాకుండా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పొలిటికల్ వ్యూహాల్లోనూ పెను మార్పులకు కారణమవుతున్నాయి.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే కూటమికి దూరంగా జరుగుతూ, లోపాయకారీగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే సంకేతాలు పంపడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ కూటమిని ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, జాతీయ స్థాయిలో యాంటీ-బీజేపీ శక్తులతో జతకట్టడం మేలనే యోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. శుక్రవారం నాటి మీడియా చిట్‌చాట్‌లో జగన్‌కు అనుకూలంగా సానుభూతి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఏపీలో జగన్ సభలకు, ర్యాలీలకు కూటమి ప్రభుత్వం అనుమతులు నిరాకరిస్తోందంటూ రేవంత్ మాట్లాడటం వెనుక.. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్‌కు దగ్గరైతే తద్వారా వచ్చే పొలిటికల్ మైలేజీని ఒడిసిపట్టాలనే ముందస్తు ప్లాన్ కనిపిస్తోంది.ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుతో నొచ్చుకున్న ఒక వర్గాన్ని శాంతపరిచేందుకే, జగన్ సభల అనుమతులపై రేవంత్ సానుభూతి అస్త్రం విసిరారనే ప్రచారం సాగుతోంది. హైదరాబాద్ గుండెకాయ లాంటి అమీర్‌పేట్ జంక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దివంగత నేత ఎన్టీ రామారావు 23 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపింది. కాంగ్రెస్‌కు బద్ధశత్రువుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే పెట్టడంపై తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ఒక వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఈ చర్యతో బీఆర్ఎస్, మలిదశ ఉద్యమకారుల నుంచి రేవంత్ విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని వైఎస్సార్ అభిమానులను, రెడ్డి సామాజికవర్గాన్ని సమతూకం చేయడానికి జగన్ ప్రస్తావన తెచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ విగ్రహం ద్వారా ఆంధ్రా సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను కొల్లగొట్టడం.. అలాగే జగన్ సభలపై సానుభూతి చూపడం ద్వారా వైఎస్సార్ ఓటు బ్యాంకును కాపాడుకోవడం రేవంత్ మార్క్ డబుల్ గేమ్ . ఈ మొత్తం పరిణామాల వెనుక ఉన్న అసలు లక్ష్యం.. త్వరలో రాబోయే హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలే. హైదరాబాద్ పరిధిలో ఆంధ్రా మూలాలున్న ఓటర్లు, సెటిలర్లు గెలుపోటములను శాసిస్తారు. గతంలో ఈ ఓటు బ్యాంక్ అంతా బీఆర్ఎస్ వైపు నిలిచింది. ఇప్పుడు కేసీఆర్ బలహీనపడటంతో ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడమే రేవంత్ రెడ్డి ఏకైక అజెండా. అందుకోసమే అటు ఎన్టీఆర్ అభిమానులను, ఇటు వైఎస్సార్ అనుచరులను ఒకేలా ప్రసన్నం చేసుకునే దిద్దుబాటు చర్యలకు ఆయన శ్రీకారం చుట్టారని అంటున్నఏపీలో షర్మిల రాజ్యసభ సీటు మిస్ అవ్వడం కూడా జగన్-కాంగ్రెస్ సాన్నిహిత్యానికి మార్గం సుగమం చేస్తోందనే వాదన ఉంది. ఒకవేళ షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్‌కు పంపి ఉంటే, జగన్ కాంగ్రెస్ వైపు చూడటం అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు మారిన సమీకరణాల్లో జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, కాంగ్రెస్‌తో ఫ్రెండ్‌షిప్‌కు సై అంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. మొత్తానికి ఏపీలో జగన్ వేస్తున్న అడుగులు.. తెలంగాణలో రేవంత్ రెడ్డి రాస్తున్న పొలిటికల్ స్క్రిప్ట్‌లు రెండూ ఒకదానికొకటి ముడిపడి సాగుతున్నాయి. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో రేవంత్ రెడ్డి నడుపుతున్న ఈ మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి.

# పేద కుటుంబాన్ని ఆదుకున్న వెస్సో ట్రస్ట్




హైదరాబాద్ జూన్ 15; రామన్నగూడెం, బుట్టాయగూడెం మండలం, ప.గో జిల్లా నివాసి లక్కోజు కనకదుర్గ (63) గత కొన్ని సంవత్సరాలుగా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమిత మయ్యారు. ఆమె భర్త వెంకటేశ్వర రావు (72) గతంలో వడ్రంగి వృత్తి చేసేవారు. అయితే వృద్ధాప్యం మరియు అనారోగ్య కారణాల వల్ల ప్రస్తుతం ఉపాధి పొందలేక పోతున్నారు. వైద్య ఖర్చులను భరించడానికి కనకదుర్గ కుటుంబం తమ ఇల్లు, స్థలం, బంగారు ఆభరణాలు సహా, ఉన్న అన్ని ఆస్తులను విక్రయించింది. వారి ఇద్దరు వివాహిత కుమార్తెలు కూడా తమ శక్తి మేరకు సహాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు వైద్య అవసరాల కోసం సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం కుటుంబం అన్ని వనరులను కోల్పోయి, ఇకపై చికిత్స ఖర్చులను భరించే స్థితిలో లేదు! ఈ క్లిష్ట పరిస్థితుల్లో, వారి బంధువు మరియు సామాజిక కార్యకర్త విస్సాకోటి నాగ వెంకట సత్యనారాయణ ద్వారా కనకదుర్గ కుటుంబ సభ్యులు వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి ఆమె వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించమని అభ్యర్థించారు.స్పందించిన వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారం తో బ్రహ్మశ్రీ ఐతే. కే యం కిరణ్ కుమార్ గారి (ఏసిపి, ఆర్థిక నేరాల విభాగం, సి సి ఎస్, హైదరాబాద్) చేతుల మీదుగా లబ్ధిదారు బంధువు సత్యనారాయణ కు 54,400/- రూపాయల చెక్ అందజేశారు. దీజీవీజ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ ఐతే. వి వి నాగార్జున నాగోజు వారి పంజాగుట్ట కార్యాలయంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఇడికోజు వెంకటాచారి, విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ కార్యదర్శి పివిఆర్కె ప్రసాద్, విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ అధ్యక్షులు విశ్వనాథుల పుష్పగిరి, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు రాయపల్లి కృష్ణమాచారి, దయానంద చారి పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ డైరెక్టర్స్ నియామకాల్లో

## శ్రీవైష్ణవులకు 50% కేటాయించాలి

## శ్రీవైష్ణవ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ డిమాండ్



హైద్రాబాద్ జూన్ 15: శ్రీవైష్ణవ సేవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ శాఖ ప్రారంభ సర్వసభ్య సమావేశం ఎల్ బి నగర్ లో జరిగింది.

ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్య, సంఘ సభ్యులు పొడిచేటి రామకృష్ణమాచార్య, ఫణిహారం శ్రీకాంత్ చార్యులు, ఉత్పల అనంతాచార్య, గామా ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ కండ్లకుంట య ా ద ్ గి ం ా చ ా ర ్ య ు ల ు , శ్రీచిలుకమర్రిలక్ష్మీనాథాచార్యులు, సభ్యులు శ్రీభాష్యం యదుమోహన్, ముడుంబ మాధవాచార్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను స్మార్తులతో భర్తీచేసి, శ్రీవైష్ణవులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కనీసం డైరెక్టర్స్ నియామకాల్లోనైనా శ్రీవైష్ణవులకు 50% కేటాయించి వెంటనే నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్యమాట్లాడుతూ..ఆర్థికంగా వెనుకబడిన శ్రీవైష్ణవులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్ని జిల్లాల్లో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 24వ తేదీన సంఘం నిర్వహించనున్న ఉచిత సామూహిక ఉపనయనాలకు 50 మంది వటువులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. తర్వాత గ్రేటర్ హైదరాబాద్ అడ్ హక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా పొడిచేటి రామకృష్ణమాచార్య, కో-కన్వీనర్లుగా ఫణిహారం శ్రీకాంత్ కృష్ణమాచార్య, తాండ్ర్యాల శ్రీనివాస చక్రవర్తి, చిలుకమర్రి కవీంద్రాచార్యులు, శేషభట్టర్ శ్రీకాంతాచార్య, బెల్లంకొండ ప్రవీణ్ కుమార్, తాండ్ర్యాల కృష్ణమోహన్, శ్రీభాష్యం హరికిషన్, కొండపాక కృష్ణమాచార్య, కాందూరి శరత్ వంశీ, మురళీ వెంకటాచార్య, చక్రవర్తుల రవికుమారాచార్య మరియు వీరితోపాటుగా 15 మందిని కార్యవర్గ సభ్యుల ఎంపిక కూడా జరిగింది.

# బంజారాహిల్స్ టూ పీవీఎక్స్ ప్రెస్ హైవే

హైదరాబాద్ జూన్ 15, హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా కీలక కారిడార్లను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ సరికొత్త మౌలిక వసతుల ప్రాజెక్టును తలపెట్టింది. ప్రధాన నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ప్రయాణం సాఫీగా సాగేలా సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1లోని జీవీకే వన్ మాల్ వద్ద ప్రారంభమై.. మాసబ్‌ట్యాంక్ మీదుగా ప్రస్తుతం ఉన్న పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుసంధానం చేసేలా సుమారు 4 కిలోమీటర్ల పొడవైన పైవంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పనులను ప్రారంభించింది. రానున్న రెండేళ్ల కాలంలోనే ఈ కారిడార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.ప్రస్తుతం నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా చేరుకోవడానికి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులో ఉన్నప్పటికీ ప్రధాన నగరం నుండి ఆ ఎక్స్‌ప్రెస్‌వేను చేరుకోవడమే ప్రయాణికులకు పెద్ద నరకంగా మారింది. ముఖ్యంగా రద్దీ వేళల్లో బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1, జీవీకే మాల్, తాజ్‌కృష్ణ, కేర్ ఆసుపత్రి, మాసబ్‌ట్యాంకు జంక్షన్లను దాటడానికి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు ఈ కొద్దిపాటి దూరం దాటడానికే గంటల కొద్దీ సమయం పడుతుండటంతో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ వైపు ఇరువైపుల ట్రాఫిక్ సమస్యకు పెద్ద ఊరట లభించనుంది. బేగంపేట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనదారులు పంజాగుట్ట ఫ్లైఓవర్ ద్వారా నేరుగా ఈ కొత్త జీవీకే ఫ్లైఓవర్ ఎక్కి ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా ఆరాంఘర్ జంక్షన్‌కు, అక్కడి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం వ్యూహాత్మక ర్యాంపులను డిజైన్ చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ప్రాంతంలో ఒక డౌన్ ర్యాంపును నిర్మించనున్నారు. ఇది ఎయిర్‌పోర్టు వైపు నుంచి వచ్చే వాహనాలు రోడ్డు నంబరు 10, 12 వైపు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి చింతల్‌బస్తీ మీదుగా రోడ్డునంబర్ 12 వైపు వెళ్లే వాహనాల కోసం చింతల్‌బస్తీ జంక్షన్ వద్ద ప్రధాన ఫ్లైఓవర్ కింద నుంచి మరో చిన్న పైవంతెన నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. ఇక లక్డీకపూల్, మాసబ్‌ట్యాంక్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలు కొత్తగా నిర్మించే ఫ్లైఓవర్ పైకి సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఎన్ఎండీసీ భవనం ముందు ఒక అప్ ర్యాంపును ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక త్వరలోనే సిద్ధం కానుందని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. డీపీఆర్ రూపకల్పన పూర్తయిన తర్వాత ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయం, భూసేకరణ అవసరాలు, ఇతర సాంకేతిక అంశాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పైవంతెన నిర్మాణానికి కృతనిశ్చయంతో ఉందని, నిధుల కొరత లేకుండా వేగంగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో పాటు పశ్చిమ హైదరాబాద్ ప్రజలకు సైతం ఎంతో వెసులుబాటు లభిస్తుంది.

## తరచూ రక్తదానం ఇవ్వటం వలన క్యాన్సర్ ముప్పు తప్పుతుంది

## రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి



వికారాబాద్ జూన్15 : ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు తాండూరులోని బెల్కటూర్ యందుగల ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ యందు స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తరచూ రక్తదానం ఇవ్వటం వలన క్యాన్సర్ ముప్పు తప్పుతుంది అని సంవత్సరంలో ఒక్కసారైనా ఇస్తే గుండెపోటు ముప్పు 88% మేర తగ్గించుకోవచ్చు అని రక్తంలో ఉండే అధిక శాతం ఇనుము వల్ల రక్తనాళాలు పూడికపోయి గుండెపోటు ముప్పు ఉంటుంది అని. రక్తదానముతో ఈ ఇనుము నిల్వలు తగ్గుతాయి అని తద్వారా కాలేయము ఆరోగ్యముగా బాగుంటుంది అని ఒక్కసారి రక్తదానం చేయడం వలన 650 కిలో క్యాలరీలు తగ్గినట్లే అని ఈ ప్రక్రియ ద్వారా శరీర బరువు అదుపులోకి వస్తుంది అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. 266 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని రక్తదానం చేసిన ప్రతి ఒక్క రక్తదాతను అభినందించారు. ఆ రక్తాన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తాండూరు లోని రక్త నిధి కేంద్రము మరియు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్ యందు గల రక్త నిధి కేంద్రము వారు పాల్గొని ఆ రక్తాన్ని సేకరించారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పేర్కొన్నారు.

## అనురాగ్ యూనివర్సిటీలో ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ కోర్సు ప్రారంభం..

# కేపీఎంజీ ఇండియాతో భాగస్వామ్యం

హైదరాబాద్, గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రముఖ విద్యాసంస్థ అనురాగ్ యూనివర్సిటీ.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (ఃఈూఐ) రంగంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఓఃఎ) కోర్సును ఇవాళ ప్రకటించింది. ఈ కోర్సులో భాగంగా ఎంపిక చేసిన కొన్ని ప్రత్యేక సబ్జెక్టులను బోధించడానికి, అలాగే విద్యార్థులకు ఇండస్ట్రీ నాలెడ్జ్ అందించడానికి ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కేపీఎంజీ (ఐఖఓఒ తిని ఎనిటతిఓ) సాంకేతిక సహాయాన్ని అందించనుంది.ఈ టూ-ఇయర్ ఫుల్-టైమ్ ప్రోగ్రామ్ పూర్తి డిజైన్, నిర్వహణ, విద్యార్థుల అసెస్‌మెంట్ (మూల్యాంకనం) బాధ్యతలను అనురాగ్ యూనివర్సిటీ చూసుకుంటుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో 30 మంది విద్యార్థుల పరిమిత సీట్లతో ప్రారంభం కానున్న ఈ మొదటి బ్యాచ్ క్లాసులు 2026 ఆగస్టు నుండి మొదలవుతాయి. ఈ కోర్సు కోసం అప్లికేషన్ల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. 2026 జులై మొదటి వారంలో దరఖాస్తుల గడువు ముగుస్తుంది.తరగతి గది అభ్యాసానికి, ఈ రంగంలోని వాస్తవ పనితీరుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ (ఓఃఎ-ఃఈూఐ) కోర్సును రూపొందించారు. ఈ రంగం వాస్తవంగా ఎలా పనిచేస్తుందనే అంశాలను ప్రతిబింబించేలా కేపీఎంజీ ఇండియా ఈ పాఠ్యప్రణాళికను పాక్షికంగా సిద్ధం చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ అనాలిసిస్, రిస్క్ అండ్ కంప్లయన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వంటి విభాగాలలో ఇండస్ట్రీ కేస్ స్టడీస్, అప్లైడ్ లెర్నింగ్ మాడ్యూల్స్ మరియు క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. అయితే విద్యార్థుల అసెస్‌మెంట్ మరియు గ్రేడింగ్ ప్రక్రియను మాత్రం పూర్తిగా అనురాగ్ యూనివర్సిటీ మాత్రమే నిర్వహిస్తుంది.ఈ మీడియా సమావేశంలో అనురాగ్ యూనివర్సిటీ స్ట్రాటజిక్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, అనురాగ్ పల్లా మరియు కేపీఎంజీ ఇండియా ఎడ్యుకేషనల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ అండ్ నేషనల్ హెడ్, నారాయణన్ రామస్వామి మాట్లాడారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి.

## ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 15 కలెక్టరేట్ వర్షాకాలానికి పూర్తి సంసిద్ధతతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## పెన్షన్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## :: జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవ రావు



సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్‌లో, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, నూతన పెన్షన్ల మంజూరు, వన మహోత్సవం, గ్రామాల పారిశుద్ధ్యం, వర్షాకాలం సంసిద్ధత అప్రమత్తత,తాగునీటి సరఫరా,వన మహోత్సవం మొక్కల పెంపకం,తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో ఎక్కడా జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.

ప్రత్యేక ప్రజా దర్బార్, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల మంజూరు కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచాలని సూచించారు.లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, వాగులు, కల్వర్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి, లోతట్టు ప్రాంతాల నుంచి గర్భిణీ స్త్రీలను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, తదితర అంశాలపై ముందస్తు కార్యకరణతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా అందేలా చూడాలని, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.

వన మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. మేడారం పరిసర ప్రాంతాలలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిపిఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపీడీవోలు,ఎంపీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి...

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 15(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా** :సంగారెడ్డి/ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు,సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిశీలించాలని సూచించారు,ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు,అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి,వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు,అందులో కలెక్టరేట్‌లో 31, సంగారెడ్డి డివిజన్‌కు 15,నారాయణఖేడ్ డివిజన్‌లో 10,జహీరాబాద్ డివిజన్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం ఘనంగా నిర్వహణ

కరీంనగర్ జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ (ఐయాూ), వాసుదేవ్ హాస్పిటల్ మరియు అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137-o సంయుక్త ఆధ్వర్యంలో రేకుర్తి, కరీంనగర్‌లో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన కోసం వాక్‌థాన్, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్ల నాటడం, సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ జనరల్ సర్జన్లకు సన్మానం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఐయాూ అధ్యక్షులు డా. ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను నాటడం ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు. జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (యాఎ) ఆధ్వర్యంలో చెట్ల నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే, రోగుల ఆరోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న శస్త్రచికిత్స నిపుణుల సేవలను గౌరవించడం, శస్త్రచికిత్స రంగంలో నాణ్యత, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, రోగి భద్రత మరియు వైద్యుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ వారోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.రేకుర్తిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. ఎలగందుల శ్రీనివాస్, డా. వి. మంగీలాల్, డా. సాయి ప్రసాద్, డా. అరుణ్ కటారి, డా. వై. నరేంద్ర, డా. ప్రదీప్, డా. మహేందర్, డా. హరికృష్ణ, డా. శైలేంద్ర, డా. అనిల్, డా. సుధీర్, డా. రాజు, డా. జితేందర్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ కంజర్ల మహేష్, ఈద కుమారస్వామి, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ శర్మ, గాలిపల్లి నాగేశ్వర్, సాగర్ రెడ్డి మరియు వాసుదేవ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, “ఆరోగ్యం ? సేవ ? పర్యావరణ పరిరక్షణ” అనే లక్ష్యంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

# ధర్మాన్ని రక్షించిన పాలకులకు ప్రకృతి శక్తులు ధన రాజ యోగం కల్పిస్థాయి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 15** ములుగు జిల్లా లో సమ్మక్క సారక్కల వారసులకు రాష్ట్రపతి యోగం సిద్ధిస్తుంది

గాయత్రి మాత ఉపాసకులు నాగ సాధువు శ్రీమాన్ దామెరుప్పుల మధు స్వామి

సమాజ హితం మానవ శ్రేయస్సు కోరు కునే పాలకులకు ప్రకృతి శక్తులు కీర్తి ప్రతిష్టలు ధన రాజ యోగం కల్పిస్తాయి అని శ్రీమాన్ మధు స్వామి భద్రాచలం లో గాయత్రి మాత త్రిశక్తి పీఠం వద్ద ధర్మ హోమం నిర్వహించిన అనంతరం తన అభిభాషన చేసారు సర్వే పల్లి రాధాకృష్ణన్ అబ్దుల్ కలామ్ నారాయణన్ ద్రౌపతి ముర్ము లాంటి వారు ధర్మాన్ని రక్షిస్తూ సమాజ హితం కోసం కృషి చేసారు భారత దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు

వీరు తమ విద్యుక్త పాలనలో ధర్మ నిరతిని పాటించారు కుట్రలు కుతంత్రాలను చేయలేదు ప్రోత్సహించలేదు సంపాదన లాలూచీ పనులకు ఆస్కారం ఇవ్వలేదు

ములుగు జిల్లా లో. సమ్మక్క సారలమ్మ ప్రకృతి శక్తులు వన దేవతల ఆశీస్సులు పొందుతూ ఉన్న పాలకులు సంపాదన కోసం కుట్రలు కుతంత్రాలు అరాచకాలు తను తన అనుచరులు చేయకుండా స్వార్థం వదిలి సమాజ హితం కోసం కృషి చేసిన పాలకులకు భారత దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించే అవకాశం( యోగం) వనదేవతలు కల్పిస్తారని ఇది ముమ్మాటికీ నిజం జరుగుతుందని చరిత్రలో వారి పేరు ఉంటుందని గాయత్రి మాత ఉపాసకులు శ్రీమాన్ మధు స్వామి తన అభిప్రాయం తెలియ చేసారు

# రుచుల రాజధాని.. హైదరాబాద్‌కు జాతీయ స్థాయి గుర్తింపు!

## ఇండియా టుడే టూరిజం అవార్డ్స్‌లో తెలంగాణకు దక్కిన స్థానం

## నేషనల్ కలినరీ డెస్టినేషన్ గా హైదరాబాద్‌కు అవార్డు

## గోవాలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు




గోవా, జూన్ 15: దేశవ్యాప్తంగా పర్యాటక రంగంలో తెలంగాణా మరో అరుదైన ఘనతను సాధించింది. తనదైన ప్రత్యేక వంటకాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం, తాజాగా ‘నేషనల్ కలినరీ డెస్టినేషన్’ (ఉత్తమ పాకశాస్త్ర గమ్యస్థానం) అవార్డును కైవసం చేసుకుంది. సోమవారం గోవా వేదికగా జరిగిన ఇండియా టుడే టూరిజం సదస్సులో ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించారు.

ఈ అవార్డును తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఇండియా టుడే గ్రూప్ చైర్మన్ అండ్ ఎడిటర్-ఇన్-చీఫ్ అరుణ్ పూరీ, ఇండియా టుడే గ్రూప్ ఎడిటోరియల్ డైరెక్టర్ (పబ్లిషింగ్) రాజ్ చెంగప్ప, దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులు, విధాన రూపకర్తలు, పర్యాటక రంగ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, హైదరాబాద్‌కు లభించిన ఈ గౌరవం నగరానికి ఉన్న గొప్ప ఆహార వారసత్వానికి, తెలంగాణ పర్యాటక రంగం సాధిస్తున్న ప్రగతికి ప్రతీక అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాదీ బిర్యానీ, ఇరానీ చాయ్, తెలంగాణ సంప్రదాయ వంటకాలు దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని తెలిపారు.

ఈ గుర్తింపు తెలంగాణను వారసత్వ సంపద, సంస్కృతి, ఆతిథ్య మర్యాదలు, సంప్రదాయ ఆహార సంస్కృతికి నిలయంగా ఉన్న ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా మరోసారి నిలబెట్టిందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ పర్యాటక కేంద్రాలు, ఎకో-టూరిజం సర్క్యూట్లు, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలు, అడ్వెంచర్ టూరిజం గమ్యస్థానాలు, సాంస్కృతిక ఆకర్షణలను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

తెలంగాణలో పర్యాటకుల రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నాయని, వారసత్వ, ఎకో, వైద్య, ఆధ్యాత్మిక, కలినరీ పర్యాటక రంగాలపై ఆసక్తి మరింత పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. పర్యాటక మౌలిక సదుపాయాల బలోపేతం, మెరుగైన అనుసంధానం, సందర్శకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ప్రపంచంలోని ప్రముఖ ఆహార నగరాల జాబితాలో హైదరాబాద్ స్థానం దక్కించుకున్న నేపథ్యంలో ఈ అవార్డు నగర ఖ్యాతిని మరింత పెంచిందన్నారు. దేశంలోని ప్రముఖ ఆహార పర్యాటక గమ్యస్థానాల్లో హైదరాబాద్ ఒకటిగా తన ప్రత్యేక గుర్తింపును మరింత బలపరుచుకుందని చెప్పారు.

ఈ అవార్డును తెలంగాణ ప్రజలకు, పర్యాటక, ఆతిథ్య రంగాలకు చెందిన భాగస్వాములందరికీ అంకితం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ గుర్తింపు తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానాల్లో ఒకటిగా తీర్చిదిద్దే ప్రయత్నాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

భారతదేశంలో పర్యాటక ప్రోత్సాహం, గమ్యస్థానాల అభివృద్ధి, సందర్శకుల అనుభవాలను మెరుగుపరచడంలో విశిష్ట కృషి చేసిన రాష్ట్రాలు, సంస్థలు, పర్యాటక రంగ భాగస్వాములకు ఇండియా టుడే టూరిజం అవార్డ్స్ ప్రదానం చేస్తారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి పాల్గొన్నారు.

# హైదరాబాద్లో ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

హైదరాబాద్ హైదరాబాద్లో తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం మరియు పాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

అల్పాహారం మరియు పాలు పంపిణీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు, పాఠశాలలకు హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# 'సింగ్ గీతం' హార్ట్ టచ్చింగ్ గా ఉంది. ప్రతిఒక్కరూ థియేటర్స్ లో ఖచ్చితంగా చూడాల్సిన సినిమా ఇది. సింగీతం గారి నుంచి మరో ల్యాండ్‌మార్క్ మూవీని ప్రేక్షకులకు అందించిన నాగ్ అశ్విన్ గారికి, వైజయంతి మూవీస్‌కు హ్యాట్సాఫ్: గోల్డెన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్ లో డైరెక్టర్ అనిల్ రావిపూడి

## మహానటి తర్వాత ప్రేక్షకులు ఇంతగా ఓన్ చేసుకున్న సినిమా సింగ్ గీతం: నిర్మాత నాగ్ అశ్విన్

## బిగ్గెస్ట్ మ్యూజికల్ సాటిస్ఫాక్షన్ ఇచ్చిన సినిమా సింగ్ గీతం: మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్




లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు లేటెస్ట్ గోల్డెన్ బ్లాక్ బస్టర్ 'సింగ్ గీతం'. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోనమై ఈ చిత్రం ప్రేక్షకులు విమర్శకులు అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ గోల్డెన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్ నిర్వహించారు.

గోల్డెన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్ లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. సినిమా చూశాను. చాలా బాగుంది. చాలా వెరైటీగా ఉంది. చాలా హార్ట్ టచింగ్‌గా ఉంది. కానీ నాకు లోలోపల ఒక ఫీలింగ్ వచ్చింది. మనం ఒక సినిమా తీసి, చాలా కష్టపడి ట్రైలర్ కట్ చేసి రిలీజ్ చేస్తుంటాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమా రిలీజ్ చేసి హిట్ కొట్టాడు. అది నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. నేనూ కూడా ట్రైలర్ లేకుండా అందంగా ప్రమోట్ చేసి సినిమా చేయాలని ఉంది. (నవ్వుతూ) కాకపోతే ఇక్కడికి వచ్చిన తర్వాత ట్రైలర్ లాంచ్ అంటున్నారు. ఒక సినిమా రిలీజ్ అయి, మంచి టాక్ తెచ్చుకుని, సక్సెస్ ఈవెంట్ జరుగుతున్న సమయంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేయడం నిజంగా చాలా వింతగా, చాలా కొత్తగా ఉంది. (నవ్వుతూ) ఒక దర్శకుడు తన కెరీర్‌లో ఒక ల్యాండ్‌మార్క్ సినిమా చేయడమే గగనం. కానీ సింగీతం గారు తీసిన ప్రతి సినిమా ఒక ల్యాండ్‌మార్క్. ఆదిత్య 369, పుష్పక విమానం, భైరవద్వీపం... ఆయన చేసిన ప్రతి సినిమా ప్రత్యేకమైన మైలురాయి. ఈ సినిమాలో అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయి. ఇంకా చూడని వారు తప్పకుండా థియేటర్లలో ఈ సినిమాను చూడాలి. ఈ సినిమాలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు. ఈ టీమ్‌లో చాలా మ్యాడ్‌నెస్ ఉంది. సింగీతం గారు దాదాపు ఏడు సంవత్సరాల క్రితమే నాకు ఈ సినిమా ఆలోచన చెప్పారు. ఆయన కథ చెప్పిన తర్వాత చాలామంది నిర్మాతలను కలిశాను. కానీ అది ఎక్కడా మెటీరియలైజ్ కాలేదు. ఈ అద్భుతమైన ఆలోచన వెనుక ఎవరైనా నిలబడితే బాగుంటుందని అనిపించేది. కొన్ని సంవత్సరాల తర్వాత అది నాగ్ అశ్విన్ రూపంలో సాధ్యమైంది. సింగీతం గారి నుంచి మరో ల్యాండ్‌మార్క్ సినిమాను ప్రేక్షకులకు అందించిన నాగ్ అశ్విన్ గారికి, వైజయంతి మూవీస్‌కు హ్యాట్సాఫ్. సింగీతం గారు వెంటనే మరో సినిమా చేయాలని కోరుకుంటున్నాను. అవకాశం వస్తే ఆయన టీమ్‌లో నేను కూడా పనిచేయాలని ఉంది. దేవిశ్రీ ప్రసాద్ గారు ఈ సినిమాకు అందించిన సంగీతానికి ప్రత్యేకంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇది ఆయన కెరీర్‌లోనే బెస్ట్ వర్క్‌లలో ఒకటిగా నిలిచిపోతుంది. టీం అందరికీ అభినందనలు

మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఎప్పటినుంచో ఒక మంచి మ్యూజికల్ సినిమా చేయాలని ఉండేది. మనం ఏదైనా బలంగా కోరుకుంటే యూనివర్స్ కూడా ఆ కోరికకు అనుకూలంగా పనిచేస్తుంది. అందుకే సింగ్ గీతం చేసే అవకాశం వచ్చింది. లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు గారికి ధన్యవాదాలు. ఇది ఆయన 40 ఏళ్ల కల. అలాంటి కలలో మేము భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. మనిషి ఆశ కూడా చాలా అందంగా ఉండాలి. చాలామంది ఆశలు కలిసి ఉంటే దేవుడు వాటిని తప్పకుండా నెరవేర్చుతాడు. ఈరోజు ఈ సెలబ్రేషన్ జరుగుతుందంటే దానికి ప్రధాన కారణం నాగ్ అశ్విన్ గారు. నిజంగా ఆయన నిర్మాత కాకపోయి ఉంటే ఈ సినిమా, ఈ వేడుక ఉండేవి కావు. సింగీతం గారు దర్శకుడిగా ఉంటే, నాగ్ అశ్విన్ గారు ఆయన కలను నిజం చేసిన వ్యక్తి. చాలా సినిమాలు బ్లాక్‌బస్టర్ అవుతాయి. మంచి డబ్బులు, పేరు తీసుకొస్తాయి. కానీ చాలా తక్కువ సినిమాలు మాత్రమే ఒక క్రియేటర్‌కు నిజమైన సంతృప్తిని ఇస్తాయి. అలాంటి బిగ్గెస్ట్ మ్యూజికల్ సాటిస్ఫాక్షన్ ఇచ్చిన సినిమా సింగ్ గీతం. ఈ సినిమాకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. మమ్మల్ని ఎంతో ఇన్‌స్పైర్ చేసిన సింగీతం గారికి థాంక్యూ. 94 ఏళ్ల వయసులో కూడా ఆయనలో ఉన్న ఫైర్‌కు మనందరం హ్యాట్సాఫ్ చెప్పాలి. జీవితంలో ఎన్నో విజయాలు సాధించిన దర్శకుడు అయినప్పటికీ, ఆయన ఆలోచనల్లో, ప్యాషన్‌లో ఉన్న అగ్ని ఏమాత్రం తగ్గలేదు. ఈ సినిమాకు సంబంధించిన సంగీతం విషయంలో నాకు వచ్చిన క్రెడిట్ అంతా మా గురువుగారు మండోలిన్ శ్రీనివాస్ గారికి అంకితం చేస్తున్నాను. అలాగే మా అమ్మగారికి, మా నాన్నగారికి అంకితం చేస్తున్నాను. వైజయంతి మూవీస్, అశ్వినీ దత్ గారి బ్యానర్‌లో ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. రైటింగ్ టీమ్‌కు, డైరెక్షన్ టీమ్‌కు, ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ సినిమాతో సింగీతం గారితో పనిచేయాలనే నా కల నెరవేరింది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. వారి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా విజయం పట్ల చాలా ఆనందంగా ఉన్నాను. ఇది ఒక అందమైన జర్నీ. ఈ సినిమాను సూపర్ డూపర్ బ్లాక్‌బస్టర్ చేసిన ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమా కొత్తగా ఆలోచించే దర్శకులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఒక కొత్త దారి చూపించిన సింగీతం గారికి నా సెల్యూట్. నాగ్ అశ్విన్ గారు సింగీతం గారి మీద చూపించిన ప్రేమ, గౌరవమే ఈ సినిమా విజయానికి ప్రధాన కారణం.

నిర్మాత నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. సావిత్రి గారి గురించి రీసెర్చ్ చేస్తున్నప్పుడు తొలిసారి సింగీతం గారిని కలిశాను. మాయాబజార్ సినిమాకు పనిచేసిన ఆయన, సావిత్రి గారిని డైరెక్ట్ చేసిన దర్శకుడు, ఆదిత్య 369 తీసిన లెజెండరీ ఫిల్మ్‌మేకర్. అలాంటి ఆయనను ఒకసారి కలవడమే జీవితాంతం గుర్తుండిపోయే మెమరీ అనుకున్నాను. కానీ ఆ జర్నీ ఇంతదూరం వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఆయన కలకు తెరరూపం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాను మేమెప్పుడూ తీయలేదు. ఈ సినిమా చేస్తూనే ఇలాంటి సినిమా ఎలా తీయాలో నేర్చుకుని మరీ తీశాం. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ గారే సంగీత దర్శకుడిగా సరైన ఎంపిక అని సింగీతం గారే చెప్పారు. ఇలాంటి సినిమా ప్రపంచంలో ఎవరూ చేయలేదని సింగీతం గారు చెప్పినప్పుడు నిజంగా ఆశ్చర్యపోయాను. కానీ సినిమా పూర్తయ్యాక అది నిజమే అనిపించింది. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు తామే పాటలు పాడారు. అహల్య, శాలిని, అయాన్ అందరూ అద్భుతంగా కుదిరారు. నివేదా, రాహుల్ ఎపిసోడ్ నాకు చాలా ఇష్టం. ప్రతి సినిమాకు ప్రేక్షకుల్లో ఒక సందేహం ఉంటుంది. కానీ ఒకసారి మంచి మౌత్ టాక్ వచ్చిన తర్వాత ప్రేక్షకులు ఆ సినిమాను తమదిగా చేసుకుంటారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ థియేటర్లకు వస్తున్నారు. మహానటి తర్వాత ప్రేక్షకులు ఇంతగా ఓన్ చేసుకున్న సినిమా ఇదే. అది సింగీతం గారి గొప్పతనం. ఈ సినిమాలో పనిచేసిన ప్రతి ఒక్కరి నిజాయితీ తెరపై కనిపించింది. అలాంటి మ్యాజిక్‌ను ప్లాన్ చేసి చేయలేం. సింగ్ గీతంకు రెండో దర్శకుడిగా చెప్పాలంటే దేవిశ్రీ ప్రసాద్ గారి పేరు చెప్పాలి. ప్రతి పాత్రకు ఆయన సంగీతం అద్భుతంగా కుదిరింది. ఈ సినిమా కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. అలాగే ఈ సినిమాకు మరో దర్శకుడు సంకల్ప్. 94 ఏళ్ల దర్శకుడు, 24 ఏళ్ల దర్శకుడు కలిసి ఒక అందమైన మ్యాజిక్‌ను సృష్టించారు.

సంకల్ప్ మాట్లాడుతూ.. ఈ సినిమా సింగీతం గారి 40 ఏళ్ల కల. ఆ కలను నెరవేర్చేందుకు నాగ్ అశ్విన్ పుట్టారేమో అనిపిస్తుంది. ఇది సింగీతం గారి కన్విక్షన్‌తో చేసిన సినిమా. కల్మషం లేని ప్రాజెక్ట్ ఇది. అందరం సింగీతం గారి కల కోసం పనిచేశాం. దేవిశ్రీ ప్రసాద్ గారితో ఎన్నో అందమైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఆయన సంగీతం కంపోజ్ చేస్తున్నప్పుడు అక్కడ ఉండటం కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతి. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

రాహుల్ రవీంద్ర మాట్లాడుతూ.. ఈ సినిమా సింగీతం గారి 40 ఏళ్ల కల. అలాంటి కలకు తెరరూపం ఇచ్చిన ఈ ప్రయాణం గురించి ఒక ప్రత్యేక కథనే రాయొచ్చు. సింగీతం గారు నాకు "యాక్షన్... కట్" చెప్పారని జీవితాంతం గర్వంగా చెప్పుకుంటాను. ఈ సినిమాలో అందరూ అద్భుతంగా నటించారు. ఆ క్రెడిట్ మొత్తం దర్శకుడికే దక్కుతుంది. దేవిశ్రీ ప్రసాద్ గారు ఇచ్చిన సంగీతం అద్భుతం. ఆయన పాటలకు మాటలు రాశారా, మాటలకు పాటలు కట్టారా అనేది కూడా అర్థం కాలేదు. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

నివేదా పేతురాజ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నాకు ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన సింగీతం గారికి, నాగ్ అశ్విన్ గారికి థాంక్యూ. నేను సినిమా చూశాను. నిజంగా కళ్లల్లో నీళ్లు వచ్చాయి. ప్రపంచంలో జరుగుతున్న ఒక ముఖ్యమైన విషయాన్ని చాలా ఆకట్టుకునేలా చూపించారు. ఇలాంటి మ్యూజికల్ సినిమాలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సింగీతం గారు డైరెక్టర్స్ డైరెక్టర్. నాకు ఈ అవకాశం ఇచ్చిన వైజయంతి మూవీస్‌కు ధన్యవాదాలు.

హీరోయిన్ అహల్య మాట్లాడుతూ.. ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే సినిమా ఇది. తప్పకుండా ఈ సినిమాను థియేటర్లలో ఎక్స్‌పీరియన్స్ చేయాలి. ఇలాంటి సినిమా ఇప్పటివరకు రాలేదు. ఇకపై రావడం కూడా చాలా కష్టం. ఈ సినిమాలో భాగం కావడం చాలా గర్వంగా ఉంది. అందరికీ థాంక్యూ.

హీరో అయాన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ అదృష్టవంతులే. అయితే అందరిలోకీ నేను మరింత అదృష్టవంతుడిని. వైజయంతి మూవీస్ ఒక మహావృక్షం లాంటిది. ఆ చెట్టు నీడలో మేమందరం ఉండటం చాలా ఆనందంగా ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన సింగీతం గారికి, నాగ్ అశ్విన్ గారికి, వైజయంతి మూవీస్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు.

హీరోయిన్ శాలిని మాట్లాడుతూ.. ఈ సినిమా మీరు చూడకపోతే చాలా గొప్ప అనుభూతిని మిస్ అయినట్టే. మీ మంచి కోసమే చెబుతున్నాను. తప్పకుండా థియేటర్లలో ఈ సినిమాను చూడండి. ఈ సినిమాను మిస్ అవ్వకండి.

యాక్టర్ బెనర్జీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఎన్నో ఏళ్లుగా నేను సినీ పరిశ్రమలో ఉన్నాను. కానీ సింగీతం శ్రీనివాసరావు గారి దర్శకత్వంలో నటించలేదనే ఒక లోటు ఉండేది. ఈ సినిమాతో ఆ లోటు తీరింది. అందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ ధన్యవాదాలు.

యాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ..తెలుగులో ఇలాంటి మ్యూజికల్ ఫిల్మ్ రావడం నిజంగా మన అదృష్టం. ఒకప్పుడు నటులే తమ పాత్రలకు తామే పాటలు పాడుకునేవారు. నాగేశ్వరరావు గారు కూడా తన పాత్రలకు ఆయనే పాడుకునేవారు. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ నటీనటులందరితో పాటలు పాడించిన సినిమాను తీసిన సింగీతం గారికి, నాగ్ అశ్విన్ గారికి ధన్యవాదాలు. ఇలాంటి సినిమాలను నిర్మించడం వైజయంతి మూవీస్‌కే సాధ్యమైంది. ఇప్పటికీ వైజయంతి మూవీస్ గోల్డెన్ హ్యాండ్స్‌లోనే ఉంది. ఎన్నో అద్భుతమైన చిత్రాలను అందించిన ఈ సంస్థ ఇప్పుడు ఒక అద్భుతమైన మ్యూజికల్ సినిమాను కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ఇలాంటి సినిమాలో భాగం కావడం మా అదృష్టం. ఈ వేడుకలో మూవీ యూనిట్ అందరూ పాల్గొన్నారు.

# దుల్కర్ సల్మాన్ స్టయిలిష్ అవతార్ 'ఐ యామ్ గేమ్' ఆగస్టు 20న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఐ యామ్ గేమ్' నుంచి తాజాగా విడుదలైన పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొత్త పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్ అత్యంత స్టైలిష్ అవతార్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచారు. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్, ఈ చిత్రాన్ని ఆగస్టు 20, 2026న ఓనం కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ప్రస్తుతం చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

దుల్కర్ సల్మాన్ సొంత నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన, స్క్రీన్‌ప్లే అందించారు.

దక్షిణ భారతదేశంలోని వందకు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన 'ఐ యామ్ గేమ్', ప్రస్తుతం మలయాళ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఇండస్ట్రీలోనే భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ తన కెరీర్‌లో ఇప్పటివరకు కనిపించని అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించబోతున్నారు. మెగా బ్లాక్‌బస్టర్ 'లోకా' తర్వాత వేఫరర్ ఫిల్మ్స్ నుంచి రాబోతున్న మరో ప్రతిష్టాత్మక చిత్రం ఇదే. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, సెకండ్ లుక్ పోస్టర్లకు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభించింది. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ హై-ఆక్టేన్ యాక్షన్ థ్రిల్లర్‌లో ఆంటోని వర్గీస్, మిస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారి, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, యాక్షన్ సన్నివేశాలను ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్స్ అన్‌బరివ్ రూపొందిస్తున్నారు.

బ్లాక్‌బస్టర్ 'ఆర్డీఎక్స్' తర్వాత నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న తదుపరి చిత్రం కూడా ఇదే. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానున్న 'ఐ యామ్ గేమ్', ప్రేక్షకులకు భారీ స్థాయి యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించడానికి సిద్ధమవుతోంది.

## విజయ్ సంగీత కలుసుకున్నారు...

చెన్నై, జూన్ 15, (న్యూస్ పల్స్) తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్.. తన భార్య సంగీతతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. విజయ్ త్రిషతో సన్నిహిత సంబంధం కొనసాగిస్తున్నారని తమిళనాడు మీడియాలో కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. వాటికి బలం చేకూర్చే విధంగా త్రిష, విజయ్ అనేక సందర్భాలలో కనిపించారు. లియో, గోట్ సినిమాలో వారిద్దరు కలిసి నటించారు. అంతకుముందు త్రిషతో విజయ్ కలిసి నటించిన గిల్లి సినిమా సరికొత్త చరిత్ర సృష్టించింది.విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష వచ్చింది. త్రిషను ఆయన తల్లి సాదరంగా ఆహ్వానించింది.. విజయ్ తండ్రి కూడా ఆమెను ప్రేమతో దగ్గరికి తీసుకున్నాడు. విజయ్ ఎన్నికల ఫలితాలలో ఎక్కువ సీట్లు సాధించిన తర్వాత.. తిరుపతి వెళ్ళిన త్రిష.. నేరుగా ఆయన ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలియజేసింది. ఆ సమయంలో గంటపాటు త్రిష విజయ్ తో కలిసి ఉంది. ఇటీవల అజిత్ మాతృమూర్తి చనిపోయినప్పుడు త్రిష విజయ్ తో కలిసి వచ్చింది. అంతకుముందు ఓ వేడుకకు విజయ్ తోనే కలిసి కనిపించింది త్రిష.సంగీత ఎన్నికలకు ముందే విజయ్ తో తనకు విడాకులు కావాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ వాయిదాలో ఉంది. త్వరలో వారిద్దరి విడాకులకు సంబంధించి కోర్టు కీలకని తీర్పును వెల్లడించే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగానే విజయ్, సంగీత మళ్లీ కలిసిపోతున్నారని వార్తలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడంతో వారిద్దరు కలిసి జంటగా జీవించడానికి అంగీకారం తెలిపినట్టు తెలుస్తోంది.ముఖ్యంగా విజయ్ తల్లి శోభ ఇద్దరి మధ్య దూరాన్ని తగ్గించడానికి ప్రయత్నించినట్టు సమాచారం. అయితే ఇంతవరకు అధికారికంగా ఈ విషయంపై ప్రకటన రాలేదు. ఒకవేళ విజయ్, సంగీత కలిసిపోతే త్రిష పరిస్థితి ఏంటి అనే చర్చ కూడా నడుస్తోంది. వచ్చే రోజుల్లో వీరిద్దరి వ్యవహారం ఎటు దారితీస్తుందో చూడాలి.విజయ్ సీఎం అయిన తర్వాత భార్య సంగీత శుభాకాంక్షలు తెలియజేయలేదు. కుమారుడు జేసన్, కుమార్తె కూడా సోషల్ మీడియాలో కనీసం విషస్ కూడా చెప్పలేదు. కుమారుడు ఏకంగా తన పేరు నుంచి విజయ్ పేరు ని తొలగించుకోవడం విశేషం. అతడు సందీప్ కిషన్ తో సిగ్మా పేరుతో ఓ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్.

## అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెం.30 తవ్వకాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్







**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజా బలం ప్రతినిధి 15 జూన్ 2026**ప్రజా సమస్యలపై పర్యవేక్షణలో భాగంగా బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ మరియు నేక్నాంపూర్ డివిజన్ల నాయకులు అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాలను సందర్శించి స్థానిక సమస్యలను పరిశీలించారు. రోడ్ నెం.30 తవ్వకాల వ్యవహారంలో ముగ్గురు రాజకీయ నాయకులు కీలక పాత్ర పోషించినట్లు, రూ.1.85 కోట్ల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనికి పరిపాలనా అనుమతి లభించగా, రూ.99.43 లక్షలకు టెండర్ ఖరారు చేయబడినట్లు2026 మే 21 తేదీన వెలువడిన మీడియా కథనాల ప్రకారం వార్తల్లో ప్రస్తావించ బడింది. అందుకు కీలక పాత్ర పోషించిన రాజకీయ నాయకులకు, సంబంధిత శాఖల అధికారులకు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లకు మధ్య జరిగిన అధికారిక లేఖా వ్యవహారం పారదర్శకత పాటిస్తూ వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలిపాలని బీ.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. వాస్తవానికి 11-05-2026 తేదీన సెరిలింగంపల్లి జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జారీ చేసిన వర్క్ ఆర్డర్‌లో ఇట్టి పనిని వర్షపు నీటి కాలువగా పేర్కొన్నారు. ఆ వర్క్ ఆర్డర్ ఆధారంగా ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోకుండా కాంట్రాక్టర్ రోడ్ నెం.30 లో ఇష్టానుసారంగా లోతైన తవ్వకాలు చేపట్టి, పటిష్టమైన అండర్






గ్రౌండ్ డ్రైనేజీ, వర్షపు నీటి కాలువ (స్టార్మ్ వాటర్ డ్రెయిన్ లైన్) మరియు తాగునీటి పైపులను దెబ్బ తీయడంతో పాటు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. ఈ నేపథ్యంలో అల్కాపూర్ టౌన్‌షిప్‌లో వర్షపు నీటి కాలువల వ్యవస్థ ఉన్నప్పుడు రోడ్ నెం.30లో మరో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అవసరం ఏమిటి ? ఇది నిజంగా వర్షపు నీటి కాలువ పనైతే అంత లోతైన తవ్వకాలు ఎందుకు చేపట్టారు ? ఇది స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అయితే, పూజా బిల్డర్స్ ప్రాంగణంలో ఉన్న యూ.జీ.డీ లైన్‌కు ఎందుకు అనుసంధానం చేస్తున్నారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజా ధనం వెచ్చించి ఈ మధ్యనె వేసిన రోడ్డును ప్రజాధనం దుర్వినియోగం పరుస్తు అశాస్త్రీయంగా తవ్వడంపై స్థానిక ప్రజలు ప్రశ్నించి నప్పుడు, కొందరు ఆర్.డబ్ల్యూ.ఏ ప్రతి నిధులు మరియు నాయకులు కాంట్రాక్టర్‌కు మద్దతుగా ఎందుకు వత్తాసు పలుకుతున్నారు ? అసలు ఆర్.డబ్ల్యూ.ఏ లు నివాసితుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారా లేక కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారా ? స్థానిక ప్రజలలో వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, కొన్ని ఆర్.డబ్ల్యూ.ఏ లను స్థానిక నాయకులు ప్రభావితం చేస్తూ ఇలాంటి అనుమానాస్పద పనులకు ఎటువంటి అభ్యంతరాలు రాకుండా చూస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో మణికొండ మున్సిపాలిటీ కాలంలో టీమ్-4 బిల్డర్‌కు సంబంధించిన వ్యవహారంలో కూడా స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పేరుతో యూ.జీ.డీ నిర్మించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ నిర్ణయం వల్ల అంజలి గార్డెన్స్ కాలనీ ప్రజలు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రజా ప్రయోజనాలు, పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యమైనవని బీ.ఆర్.ఎస్ పార్టీ స్పష్టం చేస్తో సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని, ఏవైనా అక్రమాలు, అవకతవకలు లేదా ప్రజాధన దుర్వినియోగం జరిగినట్లు తేలితే, సంబంధిత వ్యక్తుల హోదా, స్థానం, రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేస్తోంది. అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెం.30 లో గల జయశంకర్ పార్క్ పరిశీలనలో: వాకింగ్ ట్రాక్ వెంబడి అనేక విద్యుత్ దీపాలు పనిచేయక పోవడంతో నడకకు వచ్చే వారికి పాములు మరియు ఇతర విష జంతువుల నుండి ప్రమాదం ఏర్పడుతోందని, మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో పాటు వాటి పరిసరాల్లో వివిధ రకాల సామగ్రి, వ్యర్థాలు పేరుకుపోయాయి, పార్కులో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది మరియు పార్కు వాచ్‌మన్‌కు గత నాలుగు నెలలుగా వేతనం చెల్లించలేదని సమాచారం అందిందని బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్, సుమనళిని, భాను చందర్, బొడ్డు శ్రీధర్ , బిందు, శ్రీకర్ తదితరులు తెలిపారు.



## మండువ ఫౌండేషన్ ద్వారా అన్నప్రసాద వితరణ





**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజా బలం ప్రతినిధి 15 జూన్ 2026**మండువ ఫౌండేషన్ అధ్యక్షులు మండువ మధుసూదన్ శర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పవిత్రమైన, విశిష్టమైన అధిక జ్యేష్టమాస సోమవత్తి అమావాస్యను పురస్కరించుకుని సోమవారం రోజున మణికొండ మర్రి చెట్టు సమీపాన గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో దరిదాపు 100 మందికి అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### - దత్తగిరి పీఠాధిపతి అవధూతగిరి పిలుపు
### - ముగిసిన 16 సోమవారాల వ్రతం
### - వైభవంగా రుద్రయజ్ఞం, పూర్ణాహుతి

**జహీరాబాద్, జూన్ 15 ప్రజాబలం ప్రతినిధి:** వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి భూతల్లికి సేవ చేయాలి" అని సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ పిలుపునిచ్చారు.



సోమవారం షోడశ (16) సోమవారాల వ్రతం ముగింపు సందర్భంగా ఆశ్రమ మాతృమూర్తులు ఆనందగిరి, నందినిగిరి చేపట్టిన వ్రతానికి సమాప్తి నిర్వహించారు. ఈ సందర్భంగా 16 పార్థివ లింగాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతి, గౌరీ పూజ, అగ్నిగుండ ప్రవేశం, రుద్రసహిత నారాయణ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తగిరి ఆశ్రమ వేదమంత్రాలతో ప్రతిధ్వనించింది. అనంతరం మహిళా మూర్తులకు వాయినాలు ఇచ్చారు. పరిసరాలు జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, బీదర్, మొగుడంపల్లి, కోహీర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన నిర్వహించారు.



## బి ఎల్ ఏ ల సమావేశం కు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనాలి విజయవంతం చేయాలి



**ఏటూరి నాగారం డివిజన్ జాబులను ప్రతినిధి జూన్ 15**తేది :16.06.2026 అనగా రేపు మంగళవారం రోజున ములుగు జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ పంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌరవ పెద్దలు పైడాకుల అశోక్ అధ్యక్షనత లో బి ఎల్ ఎ ల సమావేశం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది కావున ఈ సమావేశనికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి ఒ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గౌరవనీయులు శ్రీమతి లిధనసరీ అనసూయ(సీతక్క) హాజరుకానున్నారు. ఏటూరునాగారం మండలంలోని సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, సర్పంచులు,అన్ని గ్రామాలలోని బి ఎల్ ఏ ( బూత్ లెవెల్ ఎజెంట్స్ ) లు హాజరు కావాలని కోరుతూ.

చిటమట రఘు
మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు
ఏటూరునాగారం.

## రైతుల భూములకు రక్షణ కల్పించాలి బడే సులోచన పై చర్యలు తీసుకోవాలి




**ఏటూరు నాగారం : డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 15** మండలంలోని ఆకలవారి గణపురం 209 సర్వే నెంబర్లు 1965 నుంచి సాగు చేసుకుంటున్న రైతుల భూముల్లో కొంతమంది ఆదివాసీలు అక్రమంగా కబ్జా చేస్తూ గుడిసెలు వేయడం జరిగిందని ఈ విషయంపై మాకు న్యాయం చేయాలని మాచర్ల వెంకటేశ్వర్లు ఫయాజ్, సరి కొప్పుల శ్రీనివాస్ తదితర రైతులు ఐటిడిఏ పిఓ ను కోరారు.

సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వివో కు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడే సులోచన ఐటిడిఏ ఉద్యోగి అయి ఉండి కూడా భూములు కబ్జా చేస్తూ రైతులను బెదిరింపులకు గురిచేస్తుంది. సులోచనతోపాటు పలకగంగ, బొల్లం సారయ్య, గొంది గౌరమ్మ, శమంతకమణి సభ్యులంతా ముఠాగా ఏర్పడి రైతుల భూముల్లో రాత్రికి రాత్రే షెడ్డు వేసి ఈ భూమి మాదే అంటూ దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. చుట్టుపక్క మండలాల నుంచి అనేక మంది గిరిజనులను తీసుకొచ్చి ఉద్దేశ పూరకంగానే గిరిజన భవన్లో ఆశ్రమించి వారిని భూముల మీదికి విసుగొలుపుతుందన్నారు. పేదల ఏమైనా మేము ఆ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. మా భూములకు రక్షణ కల్పించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఐటిడిఏ ఎదుట వారి గోడును వెళ్ల బోసుకున్నారు



# మృతుల కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 15(ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల్ గ్రామానికి చెందిన పర్గి లక్ష్మణ్ అనారోగ్యంతో బాధపడుతు సోమవారం ఉదయం 4 గంటలకు మృతి చెందాడు, అలాగే గుడ్ల మర్పల్లి గ్రామంలో జంగం దుర్గయ్య మృతి చెందాడు,

అట్టి విషయం తెలుసుకున్న రెండు కుటుంబాలకుఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు,మృతుల అంత్యక్రియల నిమిత్తం ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున 10 వేల రూపాయలు పంపించగా పంచలింగాల్ లో స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మనీలా సురేశ్ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు గుడ్ల మర్పల్లి లో గ్రామ నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు.

ఈ కార్యక్రమం లో వార్డు సభ్యుడు సామెల్,శివయ్య,కేసరం సంజీవ్ ,సంగయ్య, కానపురం సంజీవ్,రవి, సురేష్,శేఖర్, అనంతయ్య, హైమద్,పి.బాబు, నరసిములు,సుభాన్, మొగులయ్య,జనార్ధన్,ఎం.బాబు, ఆయా గ్రామాల నాయకులు గ్రామస్తులు, తధితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రేమ పూర్వకంగా ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 15 తాడ్వాయి** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కేంద్రం లోని పి ఎం శ్రీ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల లో మొదటి రోజు పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలో జాయిన్ అవ్వడానికి వస్తున్నా విద్యార్థినిలను ఉపాధ్యాయులంతా కలిసి వారిని సాదరంగా ఆహ్వానించారు,

పాఠశాల ని మామిడి తోరణాలతో పూలతో అలంకరించారు.

పాఠశాల లో మొదటిరోజు పండగ వాతావరణం నెలకొంది. గత సంవత్సరం ఎస్ ఎస్ సి ఫలితాల్లో 100% సాధించామని విద్యార్థినులకు మూడో తరగతి నుంచి వరకు ఉచిత హాస్టల్ వసతితోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ల ఇంగ్లీష్ లో బోధన, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లతో పాటు గణిత దినోత్సవం, సైన్స్ డే, సెలబ్రేషన్స్ లు. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అందిస్తున్నామని హెచ్ఎం రేవతి తెలిపారు.

అంతేకాకుండా ఎస్ ఎస్ సి లో ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థినిలను శాలువాలతో సన్మానించారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 15** కలెక్టరేట్సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారుప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 73 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 21,పెన్షన్ లకు 21,ఇతర శాఖలకు సంబంధించినవి 31 దరఖాస్తులు అందాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల అర్జీలను నేరుగా జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి వెంటనే కంప్యూటర్ ఆధారిత రశీదు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించినవారు తమ సమస్య స్థితిగతులను కంప్యూటర్ రసీదు ద్వారా పరిశీలించుకోవచ్చు అని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిఆర్ఓ రవి కుమార్, ఆర్డీవో కృష్ణవేణి,అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లిమండల పరిధిలోని ఐదు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుంది అని ఏ ఈ శ్రీరామచంద్రయ్య తెలిపారు





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల పరిధిలోని ఐదు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని గ్రామాల ప్రజలు సహకరించాలని మర్పల్లి ఏఈ రామచంద్రయ్య తెలిపారు, ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఈ గ్రామాలలో ఉంటుంది అని తెలిపారు1 పట్లూర్2 పంచలింగాల్ 3కొతులాపూర్4 సిర్పూర్ 5 వీర్లపల్లి, గ్రామాలలో కరెంటు అంతరాయం ఉంటుందని ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ తరఫున అధికారులు ఆయా గ్రామ ప్రజలకు విన్నవించడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరూ సహకరించాలని మర్పల్లి ఏఈ శ్రీ రామచంద్రయ్య, లైన్ ఇన్స్పెక్టర్ మోహన్,కృష్ణ, సిబ్బంది తెలిపారు

# జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

## పెండింగ్ దరఖాస్తులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 15 కలెక్టరేట్** సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో రెవెన్యూ అధికారులతో భూ భారతి, భూ సేకరణ, రామచంద్రపురం భూముల రీ సర్వే, మీసేవ ధ్రువీకరణ పత్రాల మంజూరు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ భారతి కార్యక్రమం అమలు పురోగతి, భూ రికార్డుల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు, అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణలో నిబంధనలు పాటిస్తూ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

రామచంద్రపురం భూముల రీ సర్వే అంశంపై పెండింగ్లో ఉన్న భూ వివాదాలు, సర్వే ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు స్పష్టమైన హక్కులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

మీసేవ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్లో ఉండకూడదని, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ సేవలను నిర్దిష్ట గడువులో అందించేలా సంబంధిత అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పురోగతిపై సమీక్షిస్తూ, సంబంధిత అధికారులు సమగ్రంగా పనిచేసి అన్ని వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల అమలు, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, పెండింగ్ సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి,డీఆర్ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు మంజుల, మహేష్ బాబు, అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద విద్యార్థులు,ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ ఎస్ ఎస్ స్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల వినూత్న కార్యక్రమం



**ఏటూరునాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 15** ఏటూరునాగారం మండల కేంద్రం లోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన ద్వారం వద్ద నూతన విద్యా సంవత్సరం సందర్భంగా ,పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సోమవారం 91-92..,2000-01 ఎస్ ఎస్ స్సి బ్యాచ్ ఇదే పాఠశాల లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక వినూత్న కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చేతికి పుష్పాలు అందించి పునఃప్రారంభం సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన శుభ తరుణంలో పూర్వ విద్యార్థులు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 91-92 ఎస్ ఎస్ స్సి బ్యాచ్ పూర్వ విద్యార్థి సాయిని మహేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందిస్తున్నారని,ఇదే పాఠశాల లో ఎందరో విద్యను నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించిన సందర్భాలు అనేకం అని,ఇటీవల ఒక విద్యార్థిని జిల్లా ర్యాంకు సాధించడం గొప్ప విశేషం అని అన్నారు. అలాగే ఉపాధ్యాయులు కూడా పిల్లలు కు ప్రభుత్వ విద్యను ప్రేరేపించేలా తల్లిదండ్రులకు తమ వంతు సూచనలు చేయాలని కొనియాడారు.విద్యార్థులకు సూచనలు ఇస్తూ పాఠశాల పునఃప్రారంభం రోజునే వచ్చినందుకు శుభాకాంక్షలు తెలుపుతూ,, మీ తోటి వారిని కూడా స్థానిక పాఠశాల లో చేర్పించాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సాంబశివరావు, పూర్వ విద్యార్థులు సాయిని మహేష్, సింధు,బొడ సారయ్య, గంజి రమేష్,చిదరాల హేమ సుందర్, మోడెం చందు,చెన్న తిరుపతి ,ఉపాధ్యాయులు,ఉపాధ్యాయునిలు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

## జర్నలిస్టులకు ఐడి కార్డుల పంపిణీ




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 15 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** నిన్న ఆదివారం సంగారెడ్డి లోని నేటివ్ ఇండియా టీవీ కార్యాలయంలో తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీ వై జె ఎఫ్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన, ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది, ఈ సందర్భంగా జర్నలిస్టులకు, గుర్తింపు ఐడి కార్డులను పంపిణీ చేశారు, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల, సంక్షేమం, వృత్తి,అభివృద్ధి, ఐక్యత,కోసం ఫెడరేషన్, కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు, ఈసమ్మేళనంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ, జర్నలిజం ప్రజాస్వామ్యానికి నాలుగొ స్తంభమని, సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు, ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులకు, ఐడి కార్డులు అందజేసి సత్కరించారు, జర్నలిస్టులు సంఘటితంగా ఉంటేనే, వృత్తిపరమైన



సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు సూచించారు,కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా మండల, స్థాయి నాయకులు, పాత్రికేయులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, తెలంగాణలో జర్నలిస్టుల గుర్తింపు కార్డులు పంపిణీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది, కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, (టీ వై జె ఎఫ్) ప్రెసిడెంట్ తనుగుల జితేందర్రావు,( టీ వై జె ఎఫ్) వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, ఆందోల్- జోగిపేట, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ( చిట్టిబాబు ) నేటివ్ ఇండియా చైర్మన్ బీరయ్య యాదవ్, కూన వేణుగోపాల్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్, తదితరులు పాల్గొన్నారు.....

# అన్నదాత రైతన్న ఆవేదన

## నేటి యూవతకు రైతన్నల విజ్ఞప్తి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 15 ( ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** అందోల్ నియోజకవర్గం లోని, లైసెన్సు వైన్ షాప్ లే కాకుండా, గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు వెలిశాయి, వీటిని అదుపు చేసే అధికారులే లేరు, ఎందుకంటే లంచాల మత్తులో మునిగిపోయి ఉన్నారు కాబట్టి, నేటి యువత ప్రతిరోజు ఏదో ఒకచోట, రహదారుల పక్కన, పొలాల మధ్య చెట్ల కింద, బీర్లు విస్కీలు తాగుతూ తాగిన మైకంలో బీరు సీసాలు పగలగొట్టి వ్యవసాయ పొలాల్లో విసిరేస్తున్నారు, మద్యం సేవించడం మితప్పు కాదు, ఎందుకంటే మీ సొంత ఖర్చులతో తాగుతున్నారు, (కానీ ఒక విషయం గమనించండి ) వర్షాలు బాగా పడడంతో రైతులు తమ పంట పొలాలను సాగు చేసుకుంటున్నారు, మీరు చేసే చిన్న తప్పు వల్ల, ఆ సీసా పెంకులు, రైతుల అరికాళ్ళకు గాని ఎద్దుల కాళ్లకు గాని, గుచ్చుకొని తెగి గాయమైతే ఎంత బాధగా ఉంటుందో మనకు తెలుసు, రైతన్నలు బాగుంటేనే వారు కష్టపడితేనే మనము మన భార్యా పిల్లలు బుక్కెడు బువ్వ తింటున్నాము, మిత్రులారా ఇది గమనించండి, ఈ పంట పొలాల్లో మీ తండ్రులే గాని మీ అక్క చెల్లెలు గాని వ్యవసాయ పనుల్లో పనిచేస్తూ ఉంటారు, మీరు చేసే చిన్న పొరపాటు వల్ల ఎంతమంది నష్టపోతారో ఒకసారి ఆలోచించండి, అందుకే మీకు మరొక్కసారి మనవి చేస్తున్నా, దయచేసి ఇలాంటి పొరపాట్లు ఇకముందు చేయకండి అని, ఓ రైతు ఆవేదనతో నేటి యువతకు విన్నవించు కుంటూ, చేతులెత్తి ప్రార్థిస్తున్నాడు.

# 1&3 గనుల్లో ఎలక్ట్రికల్ భద్రతా తనిఖీ నిర్వహణ




**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 15, ప్రజాబలం ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ1లోని 1డ3 గనుల్లో ఎలక్ట్రికల్ భద్రతా తనిఖీ నిర్వహణజీఎం (సేఫ్టీ) కార్పొరేట్ సర్క్యులర్ మేరకు ఆర్జీ-1 జీఎం సూచనలతో జీడీకే-1, 3వ గనులలో ఎలక్ట్రికల్ సిస్టమ్స్ పై సమగ్ర భద్రతా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీని ఆర్జీ-2 ఏరియా అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్ బి.వి. సత్యనారాయణ, వి.కె.పి. గ్రూప్ ఇంజనీర్ కె. గోపాల్ కృష్ణ రెడ్డి చేపట్టారు.

తనిఖీ బృందం చెక్‌లిస్ట్ ప్రకారం గని సర్ఫేస్ ఎలక్ట్రికల్ పరికరాలు, క్షుణ్ణంగా పరిశీలించ అలాగే వాటి పనితీరు, భద్రతా ప్రమాణాల అమలు, నిర్వహణ రికార్డులు మరియు అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గనులలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యుత్ పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. ఎలక్ట్రికల్ భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే లోపాలు గుర్తించిన చోట వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టి, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థలో సురక్షితమైన పనివాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి భద్రతా తనిఖీలు నిరంతరం నిర్వహించబడుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీకే-1 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జకుల్వార్, గ్రూప్ ఇంజనీర్ అల్లం ఓదెలు, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, పిట్ ఇంజనీర్ పి. శేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. క్రాంతి వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ (ఎలక్ట్రికల్) సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి

## రాజేంద్రనగర్ ఆర్డీఓగా పనిచేసిన కొప్పుల వెంకట్ రెడ్డికి పదోన్నతి



**పెద్దపల్లి: జూన్-15, ప్రజాబలం ప్రతినిధి** :పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 15:**ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టరు (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలను పరిష్కరించాలి :

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ





**పెద్దపల్లి, జూన్ 15, ప్రజాబలం ప్రతినిధి :** బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, చట్టప్రకారం వాటిని వేగవంతంగా పరిష్కరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అందిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ,ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ నిరంతరం కృషి చేస్తోందని సీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రానున్న 24 గంటల్లో వాతావరణ పరిస్థితులు

## మరింత చురుకుగా మారనున్నాయి



తెలంగాణలో వర్షాల హెచ్చరికలు.. హైదరాబాద్ సహా 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 15 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** తెలంగాణ రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో, వాతావరణ పరిస్థితులు మరింత చురుకుగా మారే అవకాశం ఉందని, రాజధాని హైదరాబాద్ తో పాటు, 18,జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్,9, తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్,6, జిల్లాలకు గ్రీన్ అలర్ట్ జారీ చేసినట్లు, భారత వాతావరణ శాఖ( ఐఎండి ) వెల్లడించింది, రాష్ట్రవ్యాప్తంగా భారీ, నుంచి మోస్తారు, తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు, దక్షిణ పశ్చిమ ఋతుపవనాల ప్రభావంతో, తెలంగాణలో వర్షపాతం పెరుగుతున్న నేపథ్యంలో, పలుచోట్ల ఉరుములు మెరుపులతో, కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ తెలిపింది, ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి,మేడ్చల్, మల్కాజ్గిరి,వికారాబాద్, సంగారెడ్డి, తదితర జిల్లాలలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది, గంటకు 40, నుంచి 60,కిలోమీటర్ల వేగంతో, ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని సూచించింది, ఆరెంజ్ అలర్ట్ చేసిన జిల్లాలలో, స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతల ప్రజలు అవసరమైతే జాగ్రత్త తీసుకోవాలని సూచించారు, భారీ వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిల్చుకోవడం ట్రాఫిక్కు అంతరాయం కలగడం, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు, మరోవైపు ఎల్లో అలర్ట్ ఉన్న జిల్లాలలో, మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, గ్రీన్ అలర్ట్ ఉన్న జిల్లాలో, సాధారణంగా తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని, వాతావరణ శాఖ తెలిపింది, రైతులు ప్రయాణికులు, తాజా వాతావరణ హెచ్చరికలను, ఎప్పటికప్పుడు గమనిస్తూ, జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు....

### లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి






**జహీరాబాద్, జూన్ 15 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ - బీదర్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ చౌబారకు చెందిన ఫజ్జులూరు రెహమాన్(22) మహమ్మద్ అజ్మత్ అనే యువకులు సోమవారం ఉదయం 11 గంటలకు సమయంలో జహీరాబాద్ వైపు నుండి బీదర్ వైపు బైక్ పై వెళుతుండగా ఖలీల్ పూర్ శివారులోని నారింజ ప్రాజెక్టు వద్ద వారి బైకును లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో కింద పడినట్లు తెలిపారు. లారీ టైరు ఫజ్లూర్ రైమాన్ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందగా, అజ్మత్ అనే యువకుడికి గాయాలయ్యాయన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com